ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
మంగళవారం 24 డిసెంబరు 2024 | 5





అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్

నౌ..కాకినాడ!

నౌ..కాకినాడ.. ఈ టైమ్ కాకినాడది.. అవును మరి నిజమే.. ఎందుకంటే షిప్ తయారీ కేంద్రంగా మారనుంది.. ఆ కేంద్రం అంటే మాటలా.. మన రాష్ట్రంలో ఒక్క విశాఖలో మాత్రమే ఉంది.. ఇప్పుడు కాకినాడలోనూ అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మారిటైం బోర్డు పాలసీలో నౌకల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.. ఈ నేపథ్యంలో ఆ కేంద్రానికి కాకినాడ అనుకూలంగా ఉంటుందని ప్రతిపాదనలు పంపారు. దీంతో కాకినాడ టైం నేడో రేపో మారనుంది.. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు..



కాకినాడలో తయారైన భారీ షిప్... నిర్మాణంలో ఉన్న మరో ఓడ

మారిటైం బోర్డు పాలసీతో తిరగనున్న దశ

- షిప్‌ల నిర్మాణానికి అనువుగా కాకినాడ
- షిప్ బిల్డింగ్ సెంటర్‌కు ప్రతిపాదన
- సుదీర్ఘ సీఫ్రంట్‌తో ప్రయోజనం
- పలు కంపెనీలూ ఆసక్తి
- గతంలో కరువైన వైసీపీ ప్రోత్సాహం
- మూడు కంపెనీలు వెనక్కు
- ఈసురోమన్న నౌకా నిర్మాణ రంగం
- కూటమితో చిగురిస్తోన్న ఆశలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

షిప్‌ల తయారీ రంగానికి కేంద్రంగా కాకినాడను తీర్చిదిద్దేలా అడుగులు పడుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మారిటైం బోర్డు పాలసీలో నౌకా నిర్మాణ క్లస్టర్ల ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో కాకినాడలో వీటి తయారీ భవిష్యత్తులో భారీగా పుంజుకోబోతోంది. అటు రూ.300 కోట్లతో చిన్న, మధ్యతరహా నౌకల నిర్మాణానికి వీలుగా షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముస్ముందు కాకినాడలో చిన్న, మధ్యతరహా నౌకలు, బార్జీలు, టగ్‌ల తయారీకి ఊతం లభించనుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మారిటైం పాలసీ కింద నౌకల తయారీ క్లస్టర్లకు ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించడం, అటు మారిటైం బోర్డు కార్యాలయం సైతం ఇక్కడే ఉండడంతో కాకినాడ దశ తిరగనుంది.

కాకినాడకు ఎప్పటి నుంచో పేరు..

విశాఖలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన హిందుస్థాన్ షిప్‌యార్డు మినహా రాష్ట్రంలో నౌకల నిర్మాణం ఇంకెక్కడా లేదు. కానీ వీటి తయారీకి అత్యంత అనువైన వాతావరణం కాకినాడలోనే ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ యుగంలో కోరంగి వద్ద నౌకల తయారీ, మరమ్మతులు జరిగేవి. అప్పుడే ఈ రంగంలో కాకినాడ పేరొందింది. వాస్తవానికి సుదీర్ఘ సాగర తీరం..దాన్ని ఆనుకుని యాంకరేజ్ పోర్టు వెంబడి వందల ఎకరాల భూములు ఉన్నాయి. నౌకల తయారీకి సముద్రానికి ఆనుకుని విశాలమైన భూములు అవసరం. నౌకలు, బార్జీలు, టగ్‌లు తయారుచేసి ఆ పక్కనే ఉన్న సముద్రజలాల్లోకి వీటిని దించి పరీక్షలు చేస్తారు. ఈ అనుకూల వాతావరణం కాకినాడలోనే ఉంది. సీఫ్రంట్‌గా పిలిచే ఈ సౌకర్యం కాకినాడ జగన్నాథపురం బ్రిడ్జి నుంచి యాంకరేజ్ పోర్టు రెండు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. వీటిని పోర్టు అధికారులు లీజుకు ఇస్తారు. ఇందులోనే శాన్ మెరైన్ ఏటా 20 వరకు చిన్నతరహా ఓడలను తయారుచేస్తోంది. అయితే కొత్త పాలసీ కింద కంపెనీలు వస్తే భవిష్యత్తులో నగరం నౌకల తయారీకి ప్రసిద్ధి చెందనుంది. అటు అధికారులు కొత్త నౌకా నిర్మాణ కేంద్రం ఈ ప్రాంతంలోనే అనువుగా ఉంటుందని తాజాగా గుర్తించారు.

నాడు పట్టించుకోని వైసీపీ

కాకినాడలో శాన్‌మెరైన్ అనే సంస్థ ఒక్కటే ఎన్నో ఏళ్లుగా చిన్న, మధ్యతరహా నౌకలు, బార్జీలు, టగ్‌లు నిర్మిస్తోంది. గతేడాది ఏకంగా 8 వేల టన్నుల భారీ నౌకను నిర్మించింది. వచ్చే ఐదేళ్లలో మరో 25 వరకు నౌకలను నిర్మించి దేశవ్యాప్తంగా పలు కంపెనీలకు అందివ్వడానికి సిద్ధమవు తోంది. మేట్ మెరైన్ అనే కంపెనీ పది ఎకరాల్లో వీటి తయారీకి సిద్ధమైనా గత ప్రభుత్వ ప్రోత్సాహం కరువై పక్కకుపోయింది. కేంద్రం ఒక పక్క రాయితీలు ప్రకటిస్తున్నా గత వైసీపీ సర్కారు మాత్రం ఈ రంగాన్ని ప్రోత్సహించడంపై దృష్టి సారించలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మారిటైం పాలసీని ప్రకటించడంతో ఈ రంగం పుంజుకోవడానికి అవకాశం ఏర్పడింది. ప్రధానంగా నౌకల తయారీ క్లస్టర్లకు ప్రాధాన్యం కల్పిస్తామని ప్రకటించడంతో ఇప్పుడు కంపెనీలు దృష్టిసారించి కాకినాడకు రావడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. అటు పాలసీ అమలుకు ఏపీ మారిటైం బోర్డును నోడల్ ఏజెన్సీగా నియమించింది. ఈ కార్యాలయం కాకినాడలో ఉండడంతో భవిష్యత్తులో నౌకా నిర్మాణం పుంజుకోవడానికి అడుగులు పడుతున్నాయి. రూ.300 కోట్లతో ఇక్కడ నౌకా తయారీ కేంద్రం ఏర్పాటుకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తే భారీ పెట్టుబడులు రానున్నాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఉన్న హిందుస్థాన్, కొచ్చిన్, గోవా, మజ్‌గావ్ షిప్ యార్డులు 100 నుంచి 150 ఎకరాల విస్తీర్ణంలో నౌకలను నిర్మిస్తున్నాయి. కాకినాడలో ఐదెకరాల విస్తీర్ణంలోనే భారీ నౌకల తయారీకి సహజసిద్ధ సీఫ్రంట్ వాతావరణం అనుకూలంగా ఉంది. కానీ ప్రోత్సాహం లేక పెట్టుబడులు రాలేదు. నౌకల తయారీ క్లస్టర్లకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించడంతో కాకినాడ కేంద్రంగా ఈ రంగం ఎదిగేలా చేయడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు.

వచ్చి.. వెళ్లిపోయాయి..

గతంలో కాకినాడలో నౌకల నిర్మాణం, మరమ్మతులకు షిప్‌యార్డును నిర్మించడానికి సింగపూర్ కంపెనీ ముందుకు వచ్చింది. సీపోర్టులో కొంతకాలం కార్యకలాపాలు నిర్వహించింది. వివిధ దశల్లో రూ.1,725 కోట్ల పెట్టుబడులకు సిద్ధమైంది. కానీ సరైన ప్రోత్సాహం కరువవడంతో ఇక్కడ యార్డును మూసేసింది. ఎల్ అండ్‌టీ కంపెనీ 2006లో కాకినాడలో షిప్ యార్డు నిర్మాణానికి ముందుకు వచ్చింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడితో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంది. కానీ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో చెన్నైకు వెళ్లిపోయింది. మరోపక్క 2020లో రూ.7కోట్ల కాకినాడ స్మార్ట్‌సిటీ నిధులతో జగన్నాథపురం సమీపంలో అధికారులు బోట్ బిల్డింగ్ యార్డు నిర్మించారు. ఇందులో ఒకేసారి 18 వరకు భారీ బోట్లు తయారుచేసే వసతులు సిద్ధం చేశారు. కానీ ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో అది ఈసురోమంటోంది.

రేషన్ బియ్యం మాయం!

- కరప మండలం కొరిపల్లి గోదాంలో అదృశ్యం
- విలువ రూ.98.50 లక్షలు
- విచారణ చేసి నివేదిక పంపించిన జేసీ

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం కొరిపల్లిలో ఒక ప్రైవేటు గోదాంలో నిల్వచేసిన రేషన్ బియ్యం మాయమయ్యాయి. పౌరసరఫరాల సంస్థకు చెందిన బియ్యం నిల్వల్లో అధిక వ్యత్యాసాలున్నట్టు అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదేశాలతో అధికారులు తనిఖీలు చేపట్టారు. గోదాంలో నిల్వలు, ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలించిన సరుకు, గోదాం యజమాని వద్దనున్న రికార్డులు, జిల్లా పౌరసరఫరాల సంస్థ వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. అయితే భారీగా 229 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం మాయం అవ్వడంతో అధికారులు అవాక్కయ్యారు. దీని విలువ రూ.98.50 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. స్టోరేజ్ లాస్ కింద కొంత సరుకు డామేజ్ అయినప్పటికీ ఇంత పెద్ద మొత్తంలో డామేజ్‌కు అవకాశం లేదు. దీంతో గోదాం యాజమానికి జరిమానా విధించి సొమ్మును రాబట్టాలని అధికారులు నిర్ణయించినట్టు తెలుస్తోంది.

తనిఖీలు చేయకుండా..

జిల్లాలో ప్రైవేటు గోదాముల్లో భద్రపర్చిన రేషన్ బియ్యాన్ని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారులు విధిగా తనిఖీలు చేయాలి. అయితే ఇక్కడ అధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు చేయకపోవడం వల్లే రేషన్ బియ్యం మాయమైనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీలు చేయకుండా ఉన్న అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదన్న ప్రశ్న ప్రధానంగా వినవస్తోంది.

నివేదిక పంపించాం..

కొరిపల్లి గోదాంలో రేషన్ బియ్యం తక్కువగా ఉన్నట్టు గుర్తించామని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. 229 మెట్రిక్ టన్నులు తక్కువగా ఎలా వచ్చిందో విచారణ చేశాం. రికార్డుల్లో ఉన్న స్టాక్‌కు, గోదాంలో ఉన్న స్టాక్‌కు తీవ్ర వ్యత్యాసం వచ్చింది. మాయమైన 229 మెట్రిక్ టన్నులపై నివేదిక రూపొందించాం. దీని విలువ సుమారు కోటి రూపాయలు ఉంటుంది. నిబంధనలను అనుసరించి గోదాం యజమాని నుంచి వసూలు చేసే అవకాశం ఉంది. దీనిపై సమగ్ర నివేదికను పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌కు నివేదించామని తెలిపారు.

నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత గడువులోగా పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానందహాల్‌లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు తదితరులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలన్నారు. రెవెన్యూ, పింఛన్లు, బియ్యం కార్డు మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు మొదలైన సమస్యలపై మొత్తం 434 అర్జీలు స్వీకరించారన్నారు. అందిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా పరిష్కరించిన అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.

మరో 26 మందిపై బైండోవర్

కాకినాడ క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు పంపిణీచేసే రేషన్ (పీడీఎస్) బియ్యాన్ని గతంలో అక్రమ రవాణా చేసి అధిక ధరకు అమ్ముకున్న 20 మందిని గుర్తించి ఈనెల 21న బైండోవర్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం జిల్లాలో పీడీఎస్ బియ్యం కేసుల్లో మరో 26 మందిని బైండోవర్ చేసినట్టు ఎస్బీ వర్గాలు తెలిపాయి. బైండోవర్ చేసిన వారిలో పిఠాపురం రూరల్‌కు చెందిన ముగ్గురు, గొల్లప్రోలుకు చెందిన ఇద్దరు, అన్నవరంలో నలుగురు, ప్రత్తిపాడులో నలుగురు, రౌతులపూడిలో ఒకరు, సామర్లకోటలో ఐదుగురు, కోటనందూరులో ఐదుగురు, పిఠాపురం టౌన్‌లో ఇద్దరిని బైండోవర్ చేసినట్టు ఎస్బీ వర్గాలు పేర్కొన్నాయి.

మళ్లీ.. ముసురు!



గొల్లప్రోలు పట్టణ శివారులో బస్తాలు తడవకుండా కప్పిన బరకాలు

- ఆకస్మికంగా మారిన వాతావరణం
- అకాల వర్షం.. తడిచిన ధాన్యం, అపరాల పంట
- బరకాలు, టార్పాలిన్లు కప్పి కాపాడుకునే ప్రయత్నం
- దిశ మార్చుకున్న వాయుగుండం
- పెరిగిన చలిగాలుల తీవ్రత

పిఠాపురం/గొల్లప్రోలు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వాతావరణం ఆకస్మికంగా మారింది. వాయుగుండం దిశ మార్చుకుంది. ఆకాశం మేఘావృతమై ఉండి వర్షం పడడంతో ఆరబెట్టిన ధాన్యం రాశులు, పొలాల్లో ఉన్న అపరాల పంటలు స్వల్పంగా తడిచాయి. తడవకుండా ఉండేందుకు బరకాలు, టార్పాలిన్లు కప్పి పంటను కాపాడుకునే ప్రయత్నాల్లో రైతులు నిమగ్నమయ్యారు. మరోవైపు చలిగాలుల తీవ్రత గణనీయంగా పెరిగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిన పరిస్థితుల్లో నాలుగు రోజులు పాటు ముసురు వాతావరణం ఏర్పడి తదనంతరం రెండు రోజులు ఎండ కాసింది. వాతావరణం ఇక మారిందని రైతులు ఊపిరిపీల్చుకున్న తరుణంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత వాయుగుండం దిశ మార్చుకుని ఏపీ తీరం వైపు వచ్చింది. దీని ప్రభావంతో సోమవారం తెల్లవారుజాము నుంచే వాతావరణం మారింది. ఆకాశమంతా మేఘావృతమైంది. చలిగాలులు వీయడం ప్రారంభించాయి. ఆకస్మికంగా మారిన వాతావరణం రైతుల్లో కలవరాన్ని కలిగించింది.

ఆరబెట్టి.. కాపాడుకునేందుకు

గత రెండు రోజులు ఎండకాయడంతో రైతులు పొలాలు, కళ్లాలు, లేఅవుట్ స్థలాలు, రహదారుల వెంబడి ధాన్యం రాశులను ఆరబెట్టుకున్నారు. పలుచోట్ల వరికోత యంత్రాలతో మాసూళ్లు నిర్వహించి ధాన్యాన్ని తీసుకువచ్చి కళ్లాల్లో ఉంచారు. మరో రెండు రోజులు ఆరబెట్టుకుని మిల్లులకు విక్రయించవచ్చునని రైతులు భావిస్తున్న తరుణంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో గొల్లప్రోలు, పిఠాపురం సహా పలు ప్రాంతాల్లో అక్కడక్కడ ధాన్యం రాశులు తడిచాయి. బరకాలు, టార్పాలిన్లు కప్పి రైతులు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు పాట్లు పడ్డారు. ఆకాశం మేఘావృతమై ఉండడంతో ధాన్యాన్ని విక్రయిద్దామని భావిస్తున్నా కొనేందుకు మిల్లర్లు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తాకు రూ.200 నుంచి 300 తక్కువకు దళారులు అడుగుతున్నారని తెలిపారు.

అపరాలు పండిస్తే...

ఏలేరు వరదల కారణంగా సార్వా వరి పంట నష్టపోయిన రైతులు అపరాలు సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికందడంతో రెండ్రోజులుగా దానిని కోసి పొలాల్లోనే ఆరబెడుతున్నారు. మరో రెండ్రోజులు ఆరబెట్టి నూర్పి మినుము, పెసలు విక్రయించాలని రైతులు భావించారు. ఆకస్మికంగా పడిన వర్షంతో అక్కడక్కడ స్వల్పంగా పంట తడిచింది. తడవకుండా కాపాడుకునేందుకు రైతులు బరకాలు కప్పారు. గొల్లప్రోలు, తాటిపర్తి, చెందుర్తి వంటి ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపించింది.


చలిగాలులతో ఉక్కిరిబిక్కిరి

సోమవారం చలిగాలుల తీవ్రత గణనీయంగా పెరిగింది. పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు కాకినాడ, పిఠాపురం తదితర ప్రాంతాల్లో 25-26 డిగ్రీలకు పడిపోయాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. గాలులు వీస్తుండడంతో ప్రజలు స్వెట్టర్లు, జర్కిన్లు, కేప్‌లు వేసుకుని రోడ్డు మీదకు వస్తున్నారు. మంగళవారం ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తీరంలో అలల ఉధృతి

- అల్పపీడన ప్రభావంతో సముద్రంలో అల్లకల్లోలం
- ఆందోళనలో మత్స్యకారులు.. సాయం కోసం వినతి

కొత్తపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో మళ్లీ అల్పపీడనం ఏర్పడడంతో కాకినాడ జిల్లా ఉప్పాడ తీరప్రాంతంలో అలల ఉధృతి గణనీయంగా పెరుగుతోంది. గత నాలుగైదు రోజుల కిందట ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో సముద్రంలో కెరటాల ధాటికి ఉప్పాడ, కోనపాపపేట, మాయాపట్నం, సూరాడపేటల్లో మత్స్యకారులకు చెందిన సమారు 18 ఇళ్లు, అంగన్‌వాడీ భవనం సముద్రంలో కొట్టుకొనిపోవడం తెలిసిందే. మళ్లీ సోమవారం ఉదయం నుంచీ తీరంలో బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో ఇటీవల ఏర్పడ్డ అల్పపీడనంతో వీచిన ఈదురు గాలులకు ఎగసిపడుతూ ఒడ్డుకు బలంగా దూసుకొచ్చిన కెరటాల ధాటితో మిగిలిన మొండి గోడలు కూడా ప్రస్తుతం ఏర్పడ్డ అల్పపీడనంతో సముద్రంలో పూర్తిగా కలిసిపోతాయని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడనాలు మత్స్యకారులపై కక్షకట్టినట్టుగా వరుసగా సంభవించడంతోపాటు రోజుల తరబడి వేట లేకపోవడం పట్ల మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరో రావడం, పరామర్శించడం తప్ప ఎటువంటి సహాయం అందించడం లేదని మత్స్యకారులు తీవ్రంగా విమర్శించడం గమనార్హం. తక్షణసాయం అందించాలని జిల్లా కలెక్టర్‌ను తీరప్రాంత మత్స్యకారులు కోరుతున్నారు.



కోనపాపపేటలో తీరంలో అలల ఉధృతి

ఇప్పటికే రేషన్ బియ్యం స్టెల్లా నౌకలోనే

- తుఫాను ప్రభావంతో నిలిచిన బియ్యం తరలింపు
- బార్జిలతో నౌక వద్దకెళ్లినా పెనుగాలులతో అడ్డంకి

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో పెనుగాలులు వీస్తుండడంతో స్టెల్లా ఎల్ నౌక నుంచి రేషన్ బియ్యం ఒడ్డుకు తీసుకొచ్చే ప్రక్రియ సోమవారం నిలిచిపోయింది. ఈనెల 4వ తేదీన అధికారుల బృందం స్టెల్లా ఎల్ నౌకలోకి వెళ్లి 12 శాంపిల్స్ తీసుకొచ్చింది. దీనిలో పీడీఎస్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. ల్యాబ్‌లో పరీక్షించి నౌకలో 1320 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్టు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రకటించారు. ఈ బియ్యం సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీ చెందినవిగా గుర్తించారు. ఇలా గుర్తించిన పీడీఎస్ బియ్యాన్ని నౌక నుంచి ఒడ్డుకు చేర్చాలని గత మూడు రోజులుగా ప్రయత్నిస్తున్నారు. అయితే తుపాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. దీనివల్ల నౌక నుంచి రేషన్ బియ్యం ఒడ్డుకు చేర్చే ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. రేషన్ బియ్యం ప్రభుత్వ గోదాముల్లో భద్రపర్చిన తర్వాత మాత్రమే ఎగుమతికి సిద్ధంగా ఉంచిన బియ్యాన్ని భారీ నౌకలోకి ఎక్కించాలి. దీనివల్ల నిర్దేశించిన సమయానికి స్టెల్లా ఎల్ నౌక పశ్చిమ ఆఫ్రికాలో బెనెట్ దేశానికి వెళ్లే పరిస్థితి కనిపించడం లేదని ఎగుమతిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను సంప్రదించగా పీడీఎస్ బియ్యాన్ని ఒడ్డుకు తీసుకొచ్చిన తర్వాతే మిగిలిన ఎగుమతిదారుల బియ్యం నౌకలోని ఎక్కిస్తారన్నారు. అనంతరం పశ్చిమాఫ్రికాకు నౌక బయలుదేరుతుందని వెల్లడించారు.

ఈ వ్యర్థం అనర్థం!

- భారీగా మూలకు చేరుతున్న ఎలక్ట్రానిక్ వస్తువులు
- కొత్తవాటి రాకతో పాతవి పక్కకి..
- ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, టీవీలు, ఫ్రిడ్జ్‌లు.. అన్నింటిదీ ఇదే పరిస్థితి..
- కార్యాలయాలు, దుకాణాలు, ఇళ్లల్లో పేరుకుపోతున్న వైనం

7

ఏసుక్రీస్తు ప్రేమ, దయ, శాంత గుణాలకు మార్గదర్శకుడు : కలెక్టర్

కార్పొరేషన్(కాకినాడ),డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, అనురాగాలు, ప్రజల మనుగడ, జీవనశైలిని మార్చాయని, ప్రజల కోసం ఆయన ప్రాణత్యాగం చేయడంతో ప్రపంచ దేశాలన్నీ ఆయనను అనుకరిస్తున్నాయని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రేమ, దయ, శాంత గుణాలు అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. సోమవారం మైనార్టీ సంక్షేమ శాఖ, ఏపీ స్టేట్ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన క్రిస్మస్ హైటీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. జిల్లాలోని ప్రజలంతా సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్లకు అందించే అన్ని కార్యక్రమాలను మరింత చేరువ చేసేందుకు ముందుంటుందని ఆయన చెప్పారు. వారికి ఎటువంటి సమస్య ఉన్నా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీస్తు జన్మదినం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో, రాష్ట్రంలో అందరూ బాగుండాలని ఆయన ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం అందరికీ అవసరమైన పనులు చేయడం జరుగుతోందన్నారు. సరైన ప్రభుత్వం, పాలకులు ఉన్నప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏసు చూపిన మార్గం, విలువలు జీవితానికి మార్గదర్శకాలు అన్నారు. తనను తాను తగ్గించుకున్నట్టయితే హెచ్చించబడతాడని చాలా సార్లు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గుర్తుచేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సునీల్‌కుమార్, రెవ. పాస్టర్ దేవిశెట్టి చార్లెస్, రెవ. బలగం శ్యామ్‌కుమార్, రెవ.జోసఫ్‌బెన్నీ, రెవ.సామ్యూల్‌సాగర్, రెవ.డాక్టర్ పీఎస్ హెన్నీ, బిషప్ పి.ఇశాక్, వై.పాపారావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కొండబాబు తదితరులు

క్రిస్మస్ స్టార్ స్వాగతం!

ఏలేశ్వరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవ మందిరాలు సిద్ధమవుతున్నాయి. క్రైస్తవులు తమ గృహాలను సుందరంగా తీర్చిదిద్దుకుంటున్నారు. క్రీస్తు దివినుంచి భువికి ఉద్భవించినందుకు సూచనగా క్రైస్తవులు తమ గృహాలను, ప్రార్థనా మందిరాలను స్టార్లతో తీర్చిదిద్దుతున్నారు. ఇందులోభాగంగా కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఆర్‌సీఎం చర్చిగేటు వద్ద నక్షత్రాల (స్టార్) మధ్యలో పశువులపాకలో క్రీస్తు జననం దృశ్యం ఎందరినో ఆకట్టుకుంటోంది.



ఏలేశ్వరంలో ఓ చర్చి వద్ద విద్యుత్ కాంతులతో ఆకట్టుకుంటూ స్వాగతం పలుకుతున్న క్రిస్మస్ స్టార్

శాంతా క్లాజ్‌ల నృత్యాలు



అనపర్తిలో శాంతాక్లాజ్‌ల వేషధారణలో నృత్యం చేస్తూ ఆకట్టుకుంటున్న చిన్నారులు

అనపర్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకల సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో సోమవారం శాంతా క్లాజ్‌లు సందడి చేశారు. అనపర్తిలోని శిలువలమ్మ చర్చి, బాప్టిస్టు చర్చిల ఆధ్వర్యంలో శాంతా క్లాజ్‌ల వేషధారణలతో చిన్నారులు గ్రామంలో పర్యటించి సందడి చేశారు. ప్రధాన కూడళ్లలో డ్యాన్స్‌లు వేస్తూ చిన్నారులకు బహుమతులు అందించారు. ప్రపంచంలో ప్రజలంతా ఆనందంగా జీవించాలన్న ఆకాంక్షతో శాంతిని నింపాలన్నదే తమ లక్ష్యమని శాంతాక్లాజ్‌లు పేర్కొన్నారు.

130ఏళ్ల లూథరన్ చర్చి

జగ్గంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట పట్టణంలో ఈ లూథరన్ చర్చికి 130ఏళ్ల చరిత్ర ఉంది. క్రిస్మస్ సందర్భంగా ప్రస్తుతం ఈ చర్చి విద్యుత్ అలంకరణలో వేడుకలకు సిద్ధమైంది. 1890లో ఈ లూథరన్ చర్చిని అప్పటి బ్రిటీష్ వారు ఐదుగురు క్రైస్తవులతో కలిసి ఏర్పాటు చేశారని, ప్రస్తుతం 1200మంది ఇక్కడకు ప్రార్థనకు వస్తున్నారని సంఘ పెద్దలు తెలిపారు. క్రిస్మస్ పండుగ వచ్చేసరికి మెట్ట ప్రాంతంలో ఈ చర్చికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ప్రస్తుతం రంగురంగుల విద్యుత్ దీపాలతోపాటు సంఘ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని వారు తెలిపారు.



విద్యుత్ దీపాలతో జగ్గంపేటలోని సెయింట్ లూథరన్ చర్చి

మార్కెట్‌లో.. క్రిస్మస్ సందడి

- వివిధ శ్రేణుల్లో వస్తువుల ధరలు
- నక్షత్రాలు రూ.10- రూ.500 వరకు..
- క్రిస్మస్ ట్రీలు రూ.35-రూ.2500 వరకు..
- డెకరేషన్ వస్తువులు రూ.75-రూ.వెయ్యి వరకు..

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలు నెలరోజులుగా ప్రారంభమయ్యాయి. మార్కెట్‌లో క్రిస్మస్ సందడి మొదలైంది. విద్యుత్ బల్బులు, అలంకరణ సామాగ్రి కనువిందు చేస్తున్నాయి. క్రైస్తవులు వివిధ వస్తువులను కొనుగోలు చేసి గృహాలను అలంకరించుకోవడంలో నిమగ్నమవుతున్నారు. నక్షత్రాలు రూ.10 నుంచి రూ.500 వరకు, క్రిస్మస్ ట్రీలు సైజును బట్టి రూ.35 నుంచి రూ.2500 వరకు ధర పలుకుతున్నాయి. శుభాకాంక్షలతో కూడిన తోరణాలు రూ.25నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారు. డెకరేషన్ వస్తువులు అయితే రూ.75నుంచి రూ.1000కు దొరుకుతున్నాయి. క్రిస్మస్ తాత డ్రెస్ రూ.275 నుంచి రూ.750 వరకు విక్రయిస్తున్నారు. క్రీస్తు ఫోటోలు, థర్మకోల్ షీట్లు, క్రిస్మస్ తాతల రూపాలను మార్కెట్‌లో అమ్ముతున్నారు. పలు రకాల క్రిస్మస్ గిఫ్టులను రూ.50 నుంచి రూ.2వేల వరకు అమ్ముతున్నారు. వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు జిల్లాలో క్రైస్తవులంతా సిద్ధమవుతున్నారు. వస్తువుల ధరలు పెరిగినా కొనడానికి మక్కువ చూపుతున్నారు. గిరాకీ బాగుందని వ్యాపారులు చెపుతున్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చర్చిలను ముస్తాబు చేశారు. కాంతులీలుతున్న విద్యుత్‌దీపాలు, రంగుల బల్బులు, నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీలతో అలంకరించారు.



తళుకుబెళుకులతో ఆకట్టుకుంటున్న క్రిస్మస్ ట్రీలు



ప్రత్యేక ఆకర్షణగా ఉన్న మేరీ క్రిస్మస్ స్ట్రిప్‌లు.. శాంతా క్లాజ్ మాస్కులు



వివిధ రంగుల్లో లభ్యమవుతున్న నక్షత్రాలు

సేవలో ఆధ్యాత్మికం

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన పిఠాపురం ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చి



పిఠాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ శతాబ్దానికి పైగా తన ప్రత్యేకతను చాటుకుంటోంది పిఠాపురంలోని పురాతనమైన చర్చి. ఈ చర్చి ఉన్న ప్రాంతాన్నే చర్చి సెంటర్‌గా వ్యవహరించడం దానికున్న ప్రాధాన్యతను చాటి చెబుతోంది. 119 ఏళ్ల క్రితం కెనడియన్లతో స్థాపించిన ఈ చర్చిలో ఏటా క్రిస్మస్, నూతన సంవత్సరంతోపాటు క్రైస్తవ పండుగలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

జిల్లాలో అతిపురాతనమైన చర్చిల్లో ఒక్కటిగా, శతాధిక వసంతాలు చరిత్ర కలిగి పిఠాపురం పట్టణంలో ఉన్న ఆంధ్రాబాపిస్టు సెంటినరీ చర్చికి రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్రం నుంచే గాక దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు ఈ చర్చికి వస్తూ ఉంటారు. 1905లో కెనడియన్ మిషనరీకి చెందిన ఈజే స్మిత్ ఈ చర్చిని స్థాపించారు. 1974 వరకూ ఈ చర్చి కెనడియన్స్ నేతృత్వంలోనే కొనసాగింది. ఈ చర్చిలో క్రైస్తవ ప్రార్థనలతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చర్చి ద్వారా పించన్లు పంపిణీ చేయడంతోపాటు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు సేవలందిస్తున్నారు. ప్రతిఏటా క్రిస్మస్ సందర్భంగా చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి ఆదివారం పిల్లలు కోసం సండే స్కూల్, యువజన సహవాసం, ఆరాధనలు జరుగుతాయి. 1954 నుంచి64 వరకూ నిమితే జాన్, 1972 వరకూ సువర్ణ రాజు చర్చి పాస్టర్లుగా వ్యవహరించారు. ప్రస్తుతం చర్చి అధ్యక్షుడిగా గుబ్బల సాల్మన్‌రాజు, చర్చి సంఘ కాపరులు(పాస్టర్లు)గా బి.థియోఫిలాస్ ఉన్నారు. క్రిస్మస్ వేడుకలకు ఈ చర్చి ముస్తాబైంది. ఇప్పటికే ఇక్కడ పిఠాపురం నియోజకవర్గస్థాయిలో ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రస్తుతం చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

శృంగారవల్లభస్వామి హుండీ ఆదాయం రూ.28,43,967



ఆలయంలో ఆదాయాన్ని లెక్కించిన దేవదాయశాఖ అధికారులు

పెద్దాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించారు. 93 రోజులకు అన్నదాన హుండీ ద్వారా రూ.6,74,695, హుండీల ద్వారా 21,69,272 వెరసి రూ.28,43,967 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు వి.ఫణీంద్రకుమార్, సాయిప్రసాద్, గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, దేవస్థానం మాజీ చైర్మన్ బందిలి సుబ్రహ్మణ్యం, అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు,నారాయణాచార్యులు ఉన్నారు.

పిఠాపురంలో శత చండీ మహాయాగం ప్రారంభం

పిఠాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌రోడ్డులో గల సద్గురు గోపాల్‌బాబా ఆశ్రమంలో 3 రోజుల పాటు నిర్వహించే శ్రీ మహారుద్ర సహిత శత చండీ మహాయాగం సోమవారం ప్రారంభమైంది. 108 యజ్ఞకుండాలతో 116మంది రుత్విక్కుల మంత్రోశ్చారణల మధ్య యాగాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, ఆది పరాశక్తి అనుగ్రహం ఈనేలపై ఉండాలని, లోకకల్యాణార్థం శ్రీ సన్నిధిసేవా ట్రసక్టౌ ఆధ్వర్యంలో ఈ మహాయాగాన్ని నిర్వహిస్తున్నామని ట్రస్టు ప్రతినిధులు వడ్లమాని సుబ్రహ్మణ్యశర్మ అవధాని, శ్రీసన్నిధి సత్యంలు వెల్లడించారు. 50మంది మహాసిద్ధ గురువులు, యోగులు, నాగసాధువుల సమక్షంలో ఈ మహాక్రతువు జరుగుతోందని తెలిపారు.చండీయాగాన్ని తిలకించేందుకు భక్తులు అధికంగా తరలివచ్చారు. యాగంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శత చండీ మహాయాగంలో పాల్గొన్న నాగసాధువులు, మహాసిద్ధగురువులు

జేఎన్టీయూకేలో... డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీఎస్సీహెచ్‌ఈ వైస్ చైర్మన్ రామ్మోహనరావు



డ్రోన్‌లను పరిశీలిస్తున్న రామ్మోహనరావు, అతిథులు

జేఎన్టీయూకే, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో భారత విద్యా మంత్రిత్వ శాఖ సహకారంతో ఇంజనీరింగ్ విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ అనే అంశంపై డీఐసీ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ.గోపాలకృష్ణ అధ్యక్షతన సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఏపీఎస్సీహెచ్‌ఈ వైస్‌చైర్మన్ కె.రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా, ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాధ్‌లు అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా రామ్మోహనరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో డ్రోన్ టెక్నాలజీని ప్రతీ చోటా ఉపయోగించడం జరుగుతందని, అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే డ్రోన్ టెక్నాలజీ వినియోగంలో ముందంజలో ఉన్నాయన్నారు. చాలా ఇంజనీరింగ్ కళాశాలలు ఇప్పటికే డ్రోన్ టెక్నాలజీ ప్రయోగశాలలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. వినూత్న ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే డ్రోన్‌లను రూపొందించేందుకు ముందుకురావాలని విద్యార్థులకు సూచించారు. వీసీ మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు డ్రోన్‌ఫ్లైట్, అసెంబ్లింగ్, ఫ్లయింగ్ టెక్నిక్స్, డ్రోన్ కాన్ఫిగరేషన్ తదితర అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. మాజీ ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, డాక్టర్ మీరాసాహెబ్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ఎన్‌ఐఆర్‌ఎఫ్ అనేది పరీక్ష

ఎన్‌ఐఆర్‌ఎఫ్ అనేది నాయకత్వ వృత్తికి ఒక పరీక్ష వంటిదని ఏపీఎస్సీహెచ్‌ఈ వైస్ చైర్మన్ కె.రామ్మోహనరావు అన్నారు. వర్శిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) డైరెక్టరేట్ ఆధ్వర్యంలో డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ సమన్వయకర్తలకు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్ 2025లో మెరుగైన పనితీరు దిశగా వ్యూహాత్మక విధానం అనే అంశంపై సోమవారం రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఐక్యూఏసీ డైరెక్టర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె.రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా, ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ గౌరవ అతిథిగా హాజరయ్యారు. రామ్మోహనరావు మాట్లాడుతూ రానున్న 5ఏళ్లలో ఏపీలో 15 నుంచి 20 వరకూ విదేశీ విశ్వవిద్యాలయాలు, 20 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఏర్పాటుకానున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాదరాజు, వీఎస్ఎస్ కుమార్, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కార్యాచరణ సిద్ధం

తెలుగు రాష్ట్రాల కోఆర్డినేటర్ శ్రీనివాస్

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు కేంద్ర సహకార మంత్రిత్వశాఖ ఆంధ్ర, తెలంగాణ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ వెల్లడించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి సొసైటీలో సోమవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల పనితీరు తెలుసుకునేందుకు ఉద్యోగులు, రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలు సేకరించి సంఘాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తొలుతగా చెందుర్తి సొసైటీని సందర్శించానని, కాకినాడ జిల్లాలోని 15 సొసైటీలను సందర్శించి సమావేశాలు ఏర్పాటు చేయడం ద్వారా 2వేలమందిని కలిసేలా ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో సహకార అభివృద్ధి కమిటీలు ఎప్పటికప్పుడు సంఘాల పనితీరును సమీక్షించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటాయని చెప్పారు. నూతన సొసైటీల ఏర్పాటుతో పాటు నష్టాల్లో ఉన్న సొసైటీలు పునరుద్ధరించడంపై దృష్టిసారిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ పిఠాపురం బ్రాంచి మేనేజరు, చెందుర్తి సొసైటీ కార్యదర్శి అనుకుల రాంబాబు పాల్గొన్నారు.



చెందుర్తిలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

‘శ్రీప్రకాష్’లో ముగిసిన టీటీ పోటీలు

పెద్దాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సురేష్‌నగర్‌లో ఉన్న శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో సీతా నరసింహ క్షేత్ర మల్టీ పర్పస్ హాల్లో నిర్వహించిన అంతర్ జిల్లా రాష్ట్రస్థాయి టీటీ చాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ.రామచంద్రావు హాజరై మాట్లాడారు. క్రీడలు మానవ మేధస్సును ఉత్తేజం చేసి దేహాన్ని పటిష్టపరుస్తాయన్నారు. శాప్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం వారికి మరిన్ని సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్ మాట్లాడుతూ కాకినాడలో క్రీడల నిమిత్తం ఇటువంటి అత్యాధునిక హంగులతో ఉన్న మల్టీపర్పస్‌హాల్‌ను నిర్మించడం ఎంతో మంది విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ భవిష్యత్‌తరాలు గర్వించదగ్గ అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ పాఠశాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ముఖ్య అతిథులకు పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్, పాఠశాల జాయింట్ కార్యదర్శి సమీర జ్ఞాపికలను అందజేశారు. అలాగే ముఖ్య అతిథులు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఏపీ టీటీ అసోసియేషన్ కార్యదర్శి పి.విశ్వనాథ్, వైస్ చైర్మన్ వి.భాస్కరరామ్, హానరరీ చైర్మన్ రావు చిన్నారావు, పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



టీటీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రైతుల వేషధారణలో పిఠాపురం భాష్యం స్కూలు విద్యార్థులు

పంచెకట్టు...తలపాగా!

రైతు వేషధారణలో అలరించిన చిన్నారులు

పిఠాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నదాతల మాదిరిగానే పంచెకట్టు, తలపాగా, చేతిలో కొడవలి, నెత్తిపై గడ్డిమోపు, గడ్డి కోస్తూ పంట పొలాల్లో ఆ చిన్నారులు చేసిన సందడి అంతా ఇంతా కాదు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురం పట్టణంలోని భాష్యం స్కూలు లిటిల్‌చాంప్స్ విద్యార్థులు సోమవారం రైతుల వేషధారణలో అందరినీ అలరించారు. సంప్రదాయ వేషధారణతో పొలాల్లో హల్‌చల్ చేశారు. దేశాభివృద్ధిలో రైతులు కీలకపాత్ర పోషిస్తున్న తీరు, వారు పంటలు ఏ విధంగా పండిస్తారనే అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూలు ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్‌ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.4 లక్షల విరాళం



వాడపల్లిలో దాతకు చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విశాఖపట్నానికి చెందిన నున్న కృష్ణహనుమంతరావు(పవన్)-శిరీష దంపతులు రూ.4 లక్షలు విరాళాన్ని సోమవారం సమర్పించారు. దాతలకు వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందచేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సామర్లకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన వైవీపీఎస్.ప్రసాద్ దంపతులు తమ కుమారుడు యాళ్ల వెంకట సత్యసాయి నవీన్ పేరిట రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఈవో బళ్ల నీలకంఠానికి చెక్‌ను సోమవారం అందజేశారు. దాతలకు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనాలను చేయించి నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటం ఇచ్చారు.



ఈ-వ్యర్థం.. అనర్థం!!

మారుతున్న కాలానికి అనుగుణంగా రోజురోజుకు ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరుగుతోంది. దీనివల్ల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు బాగా పెరగడంతో పూర్తిస్థాయిలో అవి పునశ్శుద్ధికి నోచుకోవడం లేదు. దీంతో భూమి, గాలి, నీరు కాలుష్యం అవుతున్నాయి. ప్రస్తుత కాలంలో చాలామంది రెండేసి ఫోన్లు, రెండు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, రెండు టీవీలు, ఇయర్ ఫోన్స్, ఛార్జర్లు, ప్రింటర్లు, జెరాక్స్ మిషన్లు ఇలా అనేక రకాలైన ఎలక్ట్రానిక్ వస్తువులను అవసరానికి మించి కొనుగోలు చేసి వాడుతున్నారు. అవి పాడైన తర్వాత పక్కన పాడేస్తున్నారు. తర్వాత వాటి పరిస్థితి ఏంటి..? వాటినే ఈ-వేస్ట్ అంటారు. దీన్ని ఏం చేయాలనే దానిపై కథనం..

- భారీగా మూలకు చేరుతున్న ఎలక్ట్రానిక్ వస్తువులు
- కొత్తవాటి రాకతో పాతవి పక్కకి..
- ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, టీవీలు, ఫ్రిడ్జ్‌లు.. అన్నింటిదీ ఇదే పరిస్థితి..
- కార్యాలయాలు, దుకాణాలు, ఇళ్లల్లో తెలియకుండానే పేరుకుపోతున్న వైనం
- పునర్వినియోగమే మేలంటున్న పర్యావరణవేత్తలు, ప్రేమికులు
- ఈ-వ్యర్థాల సేకరణకు.. కాకినాడలో మూడు కేంద్రాలు

జేఎన్టీయూకే, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల్లో పాత కంప్యూటర్ల స్థానంలో నూతన సాంకేతికత ఆధారంగా నడిచే కంప్యూటర్లను అమరుస్తున్నారు. ఇదొక నిరంత్ర ప్రక్రియ పాతవాటిని పక్కన పడేసి.. కొత్త పెడుతుంటారు. పాత వాటిని ఏంచేయాలో పాలుపోదు. వాటిని స్టోరూంలకు పరిమితం చేయడం తర్వాత.. చెత్తగా పడేయడం జరుగుతోంది. కొంతమంది వృత్తి రీత్యా రెండు సెల్‌ఫోన్లు ఉపయోగిస్తున్నారు. అవి అలా ఉండగానే కొత్తరకం మోడల్ సెల్‌ఫోన్‌ని కొనుగోలు చేస్తున్నారు. పాతవాటిని పక్కనే పెట్టేస్తున్నారు వాటిని విక్రయిస్తే దానిలోని డేటా ఎక్కడ దుర్వినియోగమవుతుందోననే భయంతో వాటిని ఇంట్లో పక్కనే పెట్టేస్తున్నారు.

● ప్రతి ఇంట్లోను..

ప్రతి ఇంట్లోను ఇతర వ్యర్థాల కంటే ఎలక్ట్రానిక్ వ్యర్థాలే అధికంగా పేరుకుపోతున్నాయి. అవి పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయి. ఆ విధంగా ఉండే వాటిలో ఎక్కువగా కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు ఉంటున్నాయి. ఈ పరికరాల్లో వినియోగించే చిప్‌లు, సెమీకండక్టర్లు పర్యావరణానికి ఎక్కువగా హాని చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. అసోచామ్ అనే సంస్థ దేశంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై చేపట్టిన అధ్యయనంలో ఈవ్యర్థాల ఉత్పత్తిలో మహారాష్ట్ర, తమిళనాడు తర్వాత ఏపీ ఉన్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో వాటిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

● జిల్లాలో ఇదీ పరిస్థితి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2011 లెక్కల ప్రకారం 52లక్షల85వేలమంది జనాభా ఉంటే 2024 నాటికి ఈ సంఖ్య 65లక్షలకు పెరిగిందని అంచనా. అదే స్థాయిలో ప్రస్తుతం సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, రిఫ్రిజిరేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరిగింది. వీటికి సంబంధించిన ఛార్జర్లు, బ్లూటూత్‌లు, ఇయర్‌ఫోన్లు వంటి ఉపకరణాలు వస్తున్నాయి. వాటిలో చిన్నపాటి సమస్య వచ్చినా, మార్కెట్‌లోకి కొత్త మోడల్ వచ్చినా పాత వాటిని పక్కన పెట్టేస్తున్నారు. కొత్త మోడల్ కంప్యూటర్‌లు రాగానే పాతమోడల్‌ను అటకెక్కిస్తున్నారు. ఇలా కార్యాలయాలు, కళాశాలలు, ఇళ్లల్లో పాత కంప్యూటర్లు, సీపీయూలు పేరుకుపోతున్నాయి. మౌస్‌లు, కీబోర్డులు నిరుపయోగంగా మారి పాత ఫర్నీచర్ మధ్యలో కనిపిస్తున్నాయి.

సేకరణకు కాకినాడలో మూడు కేంద్రాలు

కోల్‌కత్తాకు చెందిన హుల్లాడెక్ కంపెనీతో అవగాహన ఒప్పందం చేసుకుని కాకినాడలో 3 ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాకినాడ వార్పు రోడ్డులో మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోను, జేఎన్టీయూకేలోను, గాంధీనగర్‌లోను నిర్వహిస్తున్నారు. ఏడాదిలో రెండుసార్లు ఆ కంపెనీ ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాల ద్వారా సేకరించిన వాటిని వాహనాల్లో కంపెనీ ప్రతినిధులు తీసుకువెళ్తారు.



కాకినాడ వార్పు రోడ్డులోని ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రం



కలెక్షన్ సెంటర్‌లోని ఈ-వ్యర్థాలు

● పర్యావరణానికి చాలా హాని

ఇళ్లల్లో పేరుకుపోయే తడి,పొడి చెత్తతో పోలిస్తే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు మరింతగా హానిచేస్తాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల్లో బంగారం, వెండి, ప్లాటినం వంటి విలువైన లోహలతోపాటు పాదరసం, తగరం, సీసం, కాడ్మియం, ఆర్సెనిక్, లిథియం, బేరియం వంటి భారలోహాలు కూడా ఉంటాయి. ఇవి జలాశయాల్లోకి చేరితే తాగునీటి కాలుష్యం అవుతుంది. నేలలోకి చేరితే భూసారం క్షీణిస్తుంది. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో వాడే పదార్థాలు చెత్తకుప్పలోకి చేరినప్పుడు అనుకోకుండా మంట తగిలి వ్యర్థాలు దహనమవుతున్నాయి. దీంతో వాయుకాలుష్యం ఏర్పడి అనారోగ్యం బారినపడే అవకాశాలున్నాయి. శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఒత్తిడి, దీర్ఘకాలిక రుగ్మతలకు లోనయ్యే ప్రమాదాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు.



● త్వరలో ల్యాబ్ ఏర్పాటు

-కేవీఎస్‌జీ మురళీకృష్ణ, జేఎన్టీయూకే ఉపకులపతి

ఈ-వేస్ట్‌తో కళాఖండాలను తయారు చేసే ల్యాబ్‌ను జేఎన్టీయూకేలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. వర్సిటీ, యూసీఈకేలోని అన్నివిభాగాల నుంచి వచ్చే ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వ్యర్థాలతో కళాకృతులను తయారుచేస్తారు. కేంద్రం స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం ద్వారా ఈ-వేస్ట్‌మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది.

ఆన్‌లైన్‌లో పారామెడికల్ ఉద్యోగాల ప్రొవిజనల్ మెరిట్‌లిస్ట్‌లు

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ)లో పారామెడికల్ ఉద్యోగాల నియామకం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌లను ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్లు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో ఈ మెరిట్ లిస్ట్‌లను అభ్యర్థులు చూసుకోనేందుకు వీలుగా ప్రదర్శిస్తామన్నారు. అభ్యర్థులు ఈనెల 24 నుంచి 28 లోపు వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. మెరిట్ లిస్ట్‌లో అభ్యంతరాలు ఉంటే రిమార్క్‌ల్లో అభ్యంతరాలు తొలగింపునకు ఆ అభ్యర్థి ఈనెల 24 నుంచి 28 లోపు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకుని గెజిటెండ్ అటెస్టేషన్‌తో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఆర్ఎంసీ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

27న రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక

కాకినాడ అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రస్థాయి మహిళ, పురుషుల వాలీబాల్ జట్ల ఎంపిక ఈనెల 27న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు క్రీడాప్రాధికార సంస్థ జిల్లా అధికారి బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. జిల్లానుంచి అర్హులైన సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు అర్హతపత్రాలతో హాజరవ్వాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 7నుంచి 13 వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

హోరాహోరీగా సాగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

- పెద్దఎత్తున తరలివచ్చిన క్రీడాభిమానులు



రావులపాలెం సీఆర్సీ క్రీడాప్రాంగణంలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలికలు

రావులపాలెం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని సీఆర్సీ క్రీడా ప్రాంగణంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 50వ రాష్ట్రస్థాయి బాలురు, బాలికల జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నారు. పలు జట్లు గెలుపు కోసం ఆద్యంతం పోరాడాయి. పోటీలను తిలకించేందుకు పెద్దఎత్తున క్రీడా అభిమానులు తరలివచ్చారు. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి యలమించిలి శ్రీకాంత్, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ వీరరాఘవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రావులపాలెం సీఆర్సీ క్రీడాప్రాంగణంలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలురు

అన్నవరంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పూజలు

అన్నవరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు సోమవారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ విభాగ ఏఈవో కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పదిలం బెనబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సత్యదేవుడి దర్శనానంతరం తాతయ్యబాబు

దంత వైద్యులకు భారత్ పుట్టినిల్లు

- రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి
- ఘనంగా జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ డే
- ముఖ్యఅతిథులుగా హాజరైన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి
- దంత వైద్యులకు పట్టాభిషేకం



మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి



పట్టాలు ప్రదానం చేస్తున్న ఎంపీ పురంధేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బీవీఆర్, డాక్టర్ గన్ని భాస్కరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా అత్యధిక దంత వైద్యులు కలిగిన దేశం భారతదేశమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్ దంతవైద్య కళాశాల 7వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను స్థానిక శుశృత హాల్‌లో సోమవారం ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భారత్‌లో మానవవనరులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వైద్యవిద్యార్థులకు సూచించారు. డబ్ల్యూహెచ్‌వో గణాంకాల ప్రకారం ప్రతి 7వేల మందికి ఒక దంత వైద్యులు ఉండగా, ఇండియాలో ప్రతి 5వేలమందికి ఒక దంత వైద్యులు ఉన్నారన్నారు. మరో ముఖ్య అతిథి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ వైద్యరంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని వైద్యకళాశాలలు ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తోందన్నారు. యువ వైద్యులు సేవా దృక్పథంతో సేవలందించాలన్నారు. మరో ముఖ్యఅతిథి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ వైద్యరంగంలో ఎదురయ్యే సవాళ్ల, ఒత్తిళ్లను అధిగమిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం దంత విద్యను పూర్తి చేసిన యువ వైద్యులకు పట్టాలు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులను జీఎస్ఎల్ యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్యవిద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, డాక్టర్ తరుణ్, మెడికల్ సూపరింటెండెంట్ టీఎస్‌పీ మూర్తి, ప్రిన్సిపాల్ గంటా సునీల్, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరాజు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి విలేకరి హత్య కేసులో ఆధారాలు ఉంటే ఇవ్వండి

- తుని పోలీసులు



విలేకరులతో మాట్లాడుతున్న తుని పట్టణ, రూరల్ సీఐలు

తుని రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తుని రూరల్ ఎస్.అన్నవరం గ్రామంలో అతి కిరాతకంగా హత్యకు గురైన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కాతా సత్యనారాయణ కేసుకు సంబంధించి ఆధారాలు ఉంటే ధైర్యంగా పోలీసులకు సమర్పించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తునిరూరల్ సీఐ చెన్నకేశవరావు స్పష్టం చేశారు. ఈమేరకు తుని రూరల్ సర్కిల్ ఆఫీస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 2019లో జరిగిన ఆంధ్రజ్యోతి విలేఖరి హత్యకు సంబంధించి సీఐడీ విచారణ లోతుగా జరుగుతోందని, హత్యకుగల కారకులకు తొందరలోనే శిక్షిస్తామని ఆయన తెలిపారు. గతంతో పోలిస్తే ఇప్పుడు తుని నియోజకవర్గంలో క్రైం రేట్ సగానికి తగ్గిందని, తునిలో ప్రశాంత వాతావరణం నెలకొనడం శుభపరిణామం అన్నారు. గతం మాదిరిలా తునిలో తప్పుడు కేసులు ఉండవన్నారు. పండుగులు పురస్కరించుకుని గుండాట, కోడిపందేలు నిర్వహించడం నేరమని, పబ్లిక్ ప్లేసుల్లో ర్యాలీలు, ఊరేగింపులు, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించుకోదలిస్తే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు ఇళ్లవద్ద సీసీ కెమెరాలు అమర్చుకునేందుకు అందరూ చొరవ చూపాలన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణ గానీ, నిరాధారమైన ఆరోపణలు గానీ చేస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్‌నేరస్తులపట్ల పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. పట్టణ సీఐ గీతారామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదైనా సమస్య పరిష్కరించలేదు

- అధికారుల తీరుకు నిరసనగా.. కలెక్టరేట్‌లో కేక్ చేసేందుకు ప్రయత్నం
- అడ్డుకుని స్వాధీనం చేసుకున్న పోలీసులు



అధికారులతో కట్ చేయించేందుకు సిద్ధం చేసిన కేక్



కేక్ తీసుకువచ్చిన కోట చంద్రశేఖర్, షేక్ రెహ్మతుల్లా షరీఫ్

అమలాపురం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలు తొలగించి ముంపు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఏడాది క్రితం అర్జీ అందించారు. మళ్లీ పలుసార్లు అర్జీలు ఇచ్చినా పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు ఆ అర్జీలను పరిష్కరించినట్టు చూపుతూ క్లోజ్ చేస్తున్నారు. ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి సైతం ఇదేవిధంగా చేయడంతో ఆవేదన చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు గ్రామానికి చెందిన తెలుగు యువత మండల శాఖ అధ్యక్షుడు కోట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినూత్నంగా ఏడాది కాలమైనా అర్జీని పరిష్కరించలేదని చెబుతూ 'పిటిషన్ ఫస్ట్ యానివర్శరీ' పేరిట కేక్‌ను సిద్ధం చేసి పంచాయతీ అధికారులతో కట్ చేయించేందుకు తీసుకువచ్చారు. అప్పటికే సమాచారం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి గ్రీవెన్స్‌లో కేక్ తీసుకువచ్చిన వారిని గుర్తించారు. కేకుతోపాటు రావులపాలెం గ్రామానికి చెందిన వాసంశెట్టి నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని బయటికి తీసుకువచ్చారు. చంద్రశేఖర్ మరోసారి అర్జీని అందించి బయటకి వచ్చి తమ గోడును వివరించారు. గతేడాది ఇదే డిసెంబరు నెలలో రావులపాడులోని దుర్గావతి ఆస్పత్రి వీధిలో ఉన్న ఆక్రమణలు తొలగించి ముంపునీటి సమస్యను పరిష్కరించాలని అర్జీ అందించామన్నారు. అప్పట్లో పంచాయతీ కార్యదర్శి ఎం.సాయిపట్టాభిరామయ్య విచారణ జరిపి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. ఆక్రమణలు తొలగించని పక్షంలో పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అప్పట్లో ఇచ్చిన అర్జీ మేరకు తనను కలుసుకున్న పంచాయతీ కార్యదర్శి నెల రోజుల వ్యవధి ఇవ్వాలని కోరారు. ఆ మేరకు లిఖిత పూర్వక లేఖను సైతం అందజేశారు. ఏడాది పూర్తి అవుతున్నా ఇంతవరకు ఆక్రమణలు తొలగించలేదన్నారు. ఈనెల 2న చంద్రశేఖర్ మరోసారి కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. సమస్యను పరిష్కరించను లేదు. అర్జీదారుని సంప్రదించకుండానే సమస్య పరిష్కరించినట్టు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి మెస్సేజ్ వచ్చిన తీరును ఆయన తప్పుబట్టారు. సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని చంద్రశేఖర్, టీడీపీ మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ రెహ్మతుల్లాషరీఫ్ పేర్కొన్నారు.

6నుంచి యానాం ప్రజా ఉత్సవాలు

- పుదుచ్చేరి సీఎం, గవర్నర్‌ల పర్యాటనలు ఖరారు
- 6న సీఎం, 8న గవర్నర్ రాక



గవర్నర్‌తో చర్చిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): యానాంలో ప్రతిఏటా జనవరి 6నుంచి 8వరకు ప్రతిష్టాత్మకంగా జరిగే యానాం ప్రజాఉత్సవాలకు పుదుచ్చేరి గవర్నర్, సీఎం పర్యటనలు ఖరారైనట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు పుదుచ్చేరి వెళ్లిన ఆయన గవర్నర్ కైలాష్‌నాథ్, సీఎం ఎన్.రంగసామితో భేటీ అయ్యారు. యానాంకు సంబంధించిన అనేక పెండింగ్ అంశాలపై చర్చించడంతోపాటు వినతిపత్రం ఇచ్చానన్నారు. 6న యానాం ప్రజా ఉత్సవాల ప్రారంభ వేడుకలకు ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామితోపాటు మత్స్యశాఖ, వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ మంత్రులు హాజరుకానున్నారు. 8న జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ కైలాష్‌నాథ్, పర్యాటకశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, గవర్నర్ కార్యదర్శి హాజరుకానున్నారన్నారు. వీటికి సంబంధించిన అంశాలపై చర్చించామన్నారు. యానాంకు సంబంధించి మాస్టర్ ప్లాన్ తదితర పెండింగ్ అంశాలపై వివరించారు.

గంజాయితో ఒకరి అరెస్టు

ఆలమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ఏటిగట్టుపై నుంచి గంజాయి అమ్మకానికి తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి ఒకరిని అరెస్టు చేశారు. ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలమూరువద్ద ఏటిగట్టుపై స్థానికుడు బాడితిపోయిన గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడినుంచి 470గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గంజాయి సరఫరా చేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నామని, పూర్తి వివరాలు రాగానే కేసు నమోదు చేయనున్నామని తెలిపారు. గంజాయితో అరెస్టు చేసిన సమయంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, ఎస్ఐ ఎం.అశోక్, వీఆర్వో భారతి, వీఆర్ఏ నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ప్రభాకర్, రవికుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

లే నాన్నా..ఇంటికెళ్దాం..!

- టిప్పర్ లారీ ఢీకొని తల్లి కళ్లెదుటే కుమారుడి మృతి
- కన్నీటి పర్యంతమైన తల్లి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తల్లీకొడుకులు వెళ్తున్న ద్విచక్రవాహనానికి ఒక లారీ అడ్డుగా వచ్చింది. అమ్మా.. అంటూ రోడ్డుపై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు.. ఆ యువకుడిని తల్లి బిగ్గరగా లే.. నాన్నా ఇంటికెళ్దాం.. అన్నా కదలికలేదు. దీంతో తల్లి బోరున విలపించిన హృదయవిదారక ఘటన ఇది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామానికి చెందిన ఎల్.నరేష్(20) తన తల్లి సత్యవతితో కలిసి బ్యాంక్ పని నిమిత్తం బుల్లెట్‌పై మోరంపూడి సెంటర్‌కు బయలుదేరారు. పిడింగొయ్యి జాతీయ రహదారి సెంటర్ వద్ద మలుపులోకి వచ్చేసరికి లాలాచెరువు వైపు నుంచి వస్తున్న టిప్పర్ లారీ ఢీకొంది. దీంతో బుల్లెట్ అదుపు తప్పి సత్యవతి కిందపడిపోగా నరేష్ ఆ బండి ట్యాంక్, హ్యాండిల్‌కు చాతితో గుద్దుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే తల్లి స్థానికుల సహకారంతో ప్రభుత్వాస్పత్రికి తరలించింది. పరిస్థితి విషమించి నరేష్ మృతి చెందాడు. సత్యవతికి భర్త గతంలోనే మరణించారు. వీరికి ఇద్దరు కుమారులుండగా నరేష్ చిన్నవాడు. మృతదేహాన్ని పట్టుకుని తల్లి రోధించిన తీరుచూపరులను కంటతడి పెట్టించింది. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

గోశాలకు శంకుస్థాపన

తాళ్లరేవు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పి.మల్లవరంలో ప్రభుత్వం మంజూరు చేసిన గోశాల నిర్మాణ పనులకు సర్పంచ్ పంపన రామకృష్ణ శంకుస్థాపన చేశారు. టీడీపీ నేత ధూళిపూడి వెంకటరమణ, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ, జనసేన గ్రామకమిటీ అధ్యక్షుడు చిట్టూరి నాగు, నీటిసంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను అధికారులు పరిష్కరించాలి : ఎస్పీ



అర్జీదారుల గోడు వింటున్న ఎస్పీ

పోలీస్ గ్రీవెన్స్‌కు 57 అర్జీలు

కాకినాడ క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితులకు వారి సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 57 మంది అర్జీదారులు సోమవారం పోలీస్ గ్రీవెన్స్ సెల్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుదారుల గోడు విన్న ఎస్పీ వెంటనే స్పందించి సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఫిర్యాదుదారుల సమస్య సమ్మతమైనది అయితే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి సాధ్యమైనంత త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ మనోహర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్‌కు 11మంది ఫోన్ చేసి తమ సమస్యలు వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఆయన వివిధ సమస్యలపై వచ్చిన 13 అర్జీలను స్వీకరించారు. అదనపు కమిషనర్ కెటి సుధాకర్, కార్యదర్శి శ్రీకాం త్‌రెడ్డి, ఎస్ఈ కామేశ్వరరావు, మేనేజర్ సత్యనారాయణ, ఏడీహెచ్ సిరిల్, టీపీఆర్వో శైలజ పాల్గొన్నారు.

జనవరి 31 నుంచి తైక్వాండో చాంపియన్‌షిప్ : ఎమ్మెల్యే



కాకినాడలో పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఇండోర్ స్టేడియంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఎన్టీఆర్ మెమోరియల్ స్టేట్ తైక్వాండో చాంపియన్ షిప్-2025 పోటీలు నిర్వహించనున్నారని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల పోస్టర్‌ను తన నివాసం వద్ద సోమవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి దడాల సతీష్, ఏపీ యూత్ టైక్వాండో ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా సతీష్, ఎంఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ జె.వెంకటేష్, ఐడియల్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీను, ఆదిత్య కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ ఎన్.సత్యవతి, కోచ్‌లు లోకేష్, పరమేశ్వరి, ప్రవీణ్ పాల్గొన్నారు.

సానా సతీష్‌బాబుకు చంద్రమౌళి అభినందన



సతీష్‌బాబును అభినందిస్తున్న చంద్రమౌళి

సామర్లకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా కాకినాడకు తరలివచ్చిన సందర్భంగా సానా సతీష్‌బాబును తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. ఎంపీ క్యాంపు కార్యాలయం అయిన కొప్పవరంలో చంద్రమౌళి సతీష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సతీష్‌బాబు రానున్న కాలంలో మరిన్ని పదవులు అధిరోహించి కాకినాడ పట్టణానికే గాకుండా కాకినాడ జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురాగలరని ఆకాంక్షించారు.

సతీష్‌బాబును కలిసిన నేతలు

గొల్లప్రోలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించి జిల్లాకు వచ్చిన సానా సతీష్‌బాబును జనసేన, టీడీపీ నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన నియోజకవర్గ నాయకుడు కడారి తమ్మయ్యనాయుడు సత్కరించారు.

బీసీల ఊరేగింపు

కాకినాడ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎంపీ సానా సతీష్‌బాబును అభినందించేందుకు సోమవారం ఉదయం స్థానిక భానుగుడి సెంటర్ నుంచి అచ్చంపేట క్యాంపు కార్యాలయం వరకు బీసీలు ఊరేగింపు నిర్వహించారు. డప్పుల వాయిద్యాలు, బాణసంచా కాల్చుతూ పసుపు జెండాలతో సాగిన ఈ కార్యక్రమానికి జిల్లా శెట్టిబలిజ సంఘ నాయకులు పెంకే రాజు, యనమదల రవి ఆధ్వర్యం వహించారు. క్యాంపు కార్యాలయం వద్ద సతీష్‌బాబు జ్వరం కారణంగా అందుబాటులో లేకపోవడంతో బీసీ నాయకులు కాకినాడ మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని)ని కలిసి గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొండా వినాయక్, రాయుడు దుర్గ, అనసూరి సతీష్, పెంకే గోపి వెంకటలక్ష్మి, పెంకే నాగేశ్వరరావు, గుత్తుల మెహర్‌ప్రసాద్, పెంకే శివ, విత్తనాల రమణ అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమావేశం

కొత్తపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో నెలకొల్పే లైఫిజ్ రసాయనాల పరిశ్రమల వల్ల జీవనోపాధికి ఆటంకం కలుగుతుందని,వ్యర్థ రసాయనాలను సముద్రం లోపలకి పంపే పైపులైన్ తొలగించాలని మత్స్యకారులు ఇటీవల ఆందోళనలు చేపట్టడం విదితమే. కోనపాపపేటకు చెందిన టీడీపీ, జనసేన, వైసీపీలకు చెందిన మత్స్యకారులు సోమవారం స్థానిక రామాలయం ఆవరణలో సమావేశమయ్యారు. దీనికి నాయకత్వం వహించిన సీనియర్ టీడీపీ నేత మత్స్యకార నాయకుడు, మాజీ సర్పంచ్ కొర్ని వెంకట రమణ మాట్లాడుతూ రసాయన పరిశ్రమల వద్ద రూ.6కోట్లు మామూళ్లు తీసుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రామానికి చెందిన కొందరు మత్స్యకారులు తాము పైప్‌లైన్ తొలగించాలని చేస్తున్న వ్యతిరేకపోరాన్ని నీరుగార్చేందుకు గ్రామ బహిష్కరణ చేశారన్న ప్రచారాన్ని ముమ్మరం చేశారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

వాస్తవానికి మత్స్యకార పెద్దలు ఎవర్నీ గ్రామ బహిష్కరణ చేయలేదని ఆయన స్పష్టం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మత్స్యకారులు న్యాయంగా పోరాటం చేస్తున్న మత్స్యకారులకు సంఘీభావం తెలియజేయడం ద్వారా వారి మీద పడిన అపవాదు తొలగిపోయే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో కొందరు మత్స్య కారులు వేరేవర్గానికి చెందిన ఆరుగురు మత్స్య కారులు రసాయన పరిశ్రమల నుంచి మామూళ్లు తీసుకోవడం వాస్తవమే అనిచెప్పడం గమనార్హం.

భూ కబ్జాపై ఫిర్యాదు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రమణయ్యపేటలో తమకు ఉన్న వెయ్యి గజాల భూమిని వైసీపీ నాయకులు కబ్జా చేశారని ఆ గ్రామస్థురాలు బొంతు సీతారత్నం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తాను నిరక్షరాస్యులు కావడం, తన పిల్లలు వికలాంగులు కావడంతో వైసీపీ నాయకులు బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని తమను మోసం చేశారని, తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు కబ్జా దారులను శిక్షించాలని ఆమె కోరారు.

ఇటీవల సామర్లకోట మండలం వేట్లపాలెంలో ప్రత్యర్థుల దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని సోమవారం జిల్లాకు వినతి పత్రం అందజేశారు. ప్రత్యర్థుల దాడిలో మృతిచెందిన కార్ధాల చంద్రరావు, కార్ధాల ఏసుబాబు, కార్ధాల ప్రకాశరావు కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకోవాలని కార్ధాల కుటుంబ సభ్యులు కోరారు. బాధిత కుటుంబీకులకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని, హత్యలు వెనుకున్నవార్ని గుర్తించి అరెస్ట్ చేయాలన్నారు.

జాతీయ రైతు దినోత్సవం

పిఠాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణ శివారు ఏడుకాలువల ప్రాంత రైతుల సమక్షంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. రైతులతో కేక్ కట్ చేయించారు. ఈక్రాప్ నమోదు, పంటల బీమా పథకం తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రాజేష్, పీపీసీ స్టాఫ్, క్రాఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్లు పాల్గొన్నారు.



పిఠాపురంలో రైతులతో కేక్ కట్ చేయిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

అభివృద్ధి పనులు చేపట్టేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలి

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లయ్ నిధులు మంజూరు కావడంతో పెద్దాపురం నియోజకవర్గంలో సామర్లకోట, పెద్దాపురం మండలాలు, పట్టణాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆయా ప్రాంతాల నాయకులు పనుల ప్రాతిపదికన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప పేర్కొన్నారు. సామర్లకోటలో పట్టణ టీడీపీ నాయకులు, ఎస్సీ, ఎస్టీ నాయకులతో సోమవారం రాజప్ప సమావేశమయ్యారు. రూ.20లక్షల నిధులు సిద్ధంగా ఉన్నందున సుదీర్ఘకాలంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజల వినతుల మేరకు పశువులమ్మ గుడి వద్ద సీసీ రోడ్డు, శ్మశానానికి అవరోధంగా గోడ నిర్మాణం నిమిత్తం నిధులు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. అలాగే సామర్లకోట, పెద్దాపురం మండలాలు, పట్టణాలలో వివిధ సామాజిక వర్గాలకు కమ్యూనిటీ భవనాల నిర్మాణాల నిమిత్తం రూ.2 కోట్ల నిధులు మంజూరు కోరుతూ మంత్రిని కోరడంతో అందుకు మంత్రి నుంచి సానుకూలంగా ఆమోదం లభించిందని, రానున్న ఏడాదిన్నరలో ఈ నిధులతో నియోజకవర్గంలో మరింత జోరుగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు చినరాజప్ప తెలిపారు.



పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పూడిక తీత పనుల పరిశీలన

సామర్లకోటలో పలు వార్డుల్లో మున్సిపాల్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రైన్లలో పూడికతీత పనులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించారు. మఠం సెంటర్ నుంచి నెంబరు-2 మార్కెట్ వరకూ నిర్వహిస్తున్న పనులను పరిశీలించి కాంట్రాక్టర్ కానూరి సత్యనారాయణకు కొన్ని సూచనలు చేశారు. ముంపు బెడద పట్టణానికి శాశ్వతంగా తొలగిపోయేలా డ్రైన్లలో పూడికతీత పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. సామర్లకోట నాగిశెట్టి వారి వీధికి చెందిన చప్పటి పద్మావతికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.39,600 నగదు చెక్‌ను రాజప్ప అందజేశారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రసాదరావు

కాకినాడ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, యువతకు ఉపాధి కల్పించే వరకు నిరుద్యోగ భృతి కల్పించాలని సీపీఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రసాదరావు మాట్లాడుతూ ఈనెల 21,22 తేదీల్లో పెద్దాపురంలో జరిగిన సీపీఎం 24వ జిల్లా మహాసభల్లో 11 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నికైందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలను కదిలించి ఉద్యమాలు నిర్వహించేందుకు సభల్లో కార్యాచరణ రూపొందించామన్నారు. మన ప్రాంతం నుంచి గ్యాస్ ఉత్పత్తి అవుతున్నందున జిల్లా ప్రజలకు వంట గ్యాస్ ఉచితంగా అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయడంలో చిత్తశుద్ధి వ్యవహరించాలన్నారు. పెన్షన్ రూ.1000 పెంచడం అభినందనీయమని, అయితే ఉన్న పెన్షన్‌లు తొలగించడానికి సర్వేలు చేపడుతున్నారని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కమిటీలతో కాలయాపన చేస్తున్నారన్నారు. సీపీఎం జిల్లా సీనియర్ నేత దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఈజడ్ పేరుతో సేకరించిన భూముల్లో పరిశ్రమలు రాలేనందున తిరిగి రైతులకు భూములు అప్పగించాలన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ కాకినాడ పోర్టును రాజకీయ ప్రయోజనాలకు కేంద్రంగా కాకుండా ఉపాధి కల్పనకు కేంద్రంగా మార్చాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జి బేబీరాణి, కేఎస్.శ్రీనివాస్, పలివెల వీరబాబు, సీహెచ్ రాజ్‌కుమార్, టేకుమూడి ఈశ్వరరావు, సీహెచ్.రమణి, నీలపాల సూరిబాబు పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శిగా కరణం

సామర్లకోట, డిసెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): సీపీఎం పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శిగా సామర్లకోటకు చెందిన కరణం ప్రసాదరావును నియమిస్తూ సీపీఎం 24వ జిల్లా మహాసభలో తీర్మానించినట్లు సీపీఎం నాయకుడు విప్పర్తి కొండలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసాదరావును పలువురు సీపీఎం, సీఐటీయూ నాయకులు అభినందించారు.

ట్రాక్టర్ బోల్తా

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్



చికిత్స పొందుతున్న డ్రైవర్ శ్రీను

సామర్లకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెం కెనాల్ రోడ్డులో హుస్సేన్‌పురం దళితవాడ సమీపాన హుస్సేన్‌పురం వెళ్తున్న ట్రాక్టర్ సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ట్రాక్టర్ నడుపుతున్న హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన కోట శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. సామర్లకోట నుంచి హుస్సేన్‌పురం వెళ్తుండగా దళితవాడ సమీపించేసరికి ట్రాక్టర్ రాబార్‌పై ఉంచిన జేసీబీ చక్రం అదుపుతప్పి రోడ్డుపై పడడం, అదే సమయంలో ట్రాక్టర్ తొట్టి ఆ చక్రంపైకి ఎక్కడంతో అదుపు తప్పి బోల్తా పడింది. రోడ్డుపై పడిపోయిన ట్రాక్టర్ డ్రైవర్‌పై నుంచి చక్రం వెళ్లడంతో శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. హుస్సేన్‌పురం టీడీపీ నాయకుడు చల్లా బుజ్జి సంఘటనా స్థలికి చేరుకుని శ్రీనును ప్రైవేట్ వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు రోడ్డుకు అవరోధంగా బోల్తా పడిన ట్రాక్టర్‌ను గ్రామస్తుల సహకారంతో యథా స్థానానికి చేర్చి కెనాల్ రోడ్డుపై రాకపోకలను పునరుద్ధరించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన బొల్లం సత్తిబాబు(47) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 5నెలల క్రితం పక్షవాతానికి గురై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి ఆసుపత్రికి వెళ్లడం, మందులు తీసుకోవడం నిత్యకృత్యంగా మారిందన్న మనస్తాపంతో ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. అతడిని ప్రత్తిపాడు, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండల ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశం సోమవారం అచ్చంపేట సెంటర్‌లో అధ్యక్ష, కార్యదర్శులు దైవ, ప్రవీణ్ గుప్తాల ఆధ్వర్యంలో నిర్వహించారు. రూరల్ ప్రెస్‌క్లబ్‌కి అడ్‌హాక్ కమిటీగా ఐదుగురు సభ్యులను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు. క్లబ్ సభ్యులుగా ప్రవీణ్ గుప్తా, పి.సాయిరాం, చక్రరావు, గీసాల శ్రీనివాస్, బైరెడ్డి రాజా, మోహన్‌ను ఎన్నుకున్నట్టు సంఘం అధ్యక్షుడు దైవ తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి డిప్యూటీ సీఎం చర్యలు

గొల్లప్రోలు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చర్యలు తీసుకుంటున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరంలోని కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10లక్షలు మంజూరయ్యాయి. ఇందులో తొలి విడతగా వచ్చిన రూ.2,97,624 చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు మర్రెడ్డి అందజేశారు.



ఏకేమల్లవరంలో కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి నిధులను అందజేస్తున్న మర్రెడ్డి

'కీర్తన మృతి బాధాకరం'

కొత్తపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలతో చికిత్స కోసం కారులో ఆసుపత్రికి వెళుతోన్న చిన్నారి జయకీర్తన వాహనానికి దారి ఇవ్వకపోవడం, సకాలంలో వైద్యం అందక చిన్నారి మృతిచెందడం అత్యంత బాధాకరమని, వైసీపీ నాయకుల తీరు అత్యంత హేయమని పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మాజీ సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలను వైసీపీ నాయకులు వాకతిప్పలో రోడ్డులో నిర్వహించడం, గాయాలతో ఉన్న చిన్నారికి అత్యవరంగా చికిత్స అందించేందుకు తండ్రి షారోన్‌కుమార్ జయకీర్తనను భుజాన మోసుకుని వెళుతోన్న సమయంలో వైసీపీ నాయకులు బాధ్యతాయుతంగా దారి ఇచ్చి ఉంటే చిన్నారి మృతి చెంది ఉండేదికాదన్నారు. రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కారాదన్నారు. చిన్నారి మృతికి సంతాపం ప్రకటించారు.

'అమిత్ షాపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'



తాళ్లరేవులో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల కార్యకర్తలు

కాకినాడ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై అట్రాసిటీ కేసు నమోదుచేసి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం చైర్మన్ మొయ్యేటి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యసభ సమావేశాల్లో భారతీయులు దైవంగా భావించే భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను తక్షణం పదవి నుంచి తొలగించాలన్నారు. ఈ దురదృష్టకర ఘటనపై కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే స్పందించి మతతత్వ బీజేపీ ధోరణిని ఖండించారని తక్షణమే అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పి అంబేడ్కర్ విగ్రహం ముందర మోకరిల్లాలన్నారు. జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు మాట్లాడుతూ తక్షణం అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎస్సీ విభాగం నాయకులు కొండా శ్రీను, పిట్టా అర్జున్, చీకట్ల అనిల్, రాజేంద్ర ఉన్నారు.

తాళ్లరేవులో ధర్నా

తాళ్లరేవు: కేంద్ర మంత్రి పదవి నుంచి అమిత్ షాను తొలగించాలని ప్రజాసంఘాలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశాయి. ప్రజా సంఘాల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంటులో అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. అంగన్ వాడీలు, ఆశావర్కర్లు, యానిమేటర్లు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్వాధీనం

తాళ్లరేవు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గాడిమొగ పంచాయతీ బాబానగర్ దళితులకు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చొరవతో రెవెన్యూ అధికార్లు శ్మశానవాటికను స్వాధీనం చేశారు. తహశీల్దార్ పి.త్రినాదరావు, డీటీ ఎమ్.సూరిబాబు, సర్వేయర్ మహ్మద్‌షఫీఉల్లా మత్స్యకారులు, దళితుల సమక్షంలో శ్మశాన వాటికను సర్వే చేసి సరిహద్దు రాళ్లు ఏర్పాటుచేసి దళితులకు స్వాధీనం చేశారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, స్థానిక నాయకుడు నడింపల్లి వినోద్‌లకు దళిత నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భర్త కామాడి మాతరాజు, పోలేకుర్రు టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్, జక్కల ప్రసాద్, బాబానగర్ గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

చేబ్రోలులో క్రిస్మస్ వేడుకలు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. గౌతమి హైస్కూలు విద్యార్థులు యేసేపు, గొల్లలు, దేవదూతలు, రాజు, జ్ఞానులు, శాంతాక్లాజ్, క్రిస్మస్ తాత వేషధారణలలో అలరించారు. క్రైస్తవ గీతాలు ఆలపించారు. నాటికలు ప్రదర్శించారు. క్రాఫ్ట్ వర్కుతో క్రిస్మస్ ట్రీని తయారు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓరుగంటి సూర్యనారాయణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల దృశ్యం

గొల్లప్రోలు ఎంపీడీవోగా ట్రైనీ కలెక్టర్ భావన



ఎంపీడీవోగా విధుల్లో చేరిన భావన

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా ట్రైనీ కలెక్టర్ భావన సోమవారం విధుల్లో చేరారు. శిక్షణలో భాగంగా జనవరి 15వ తేది వరకూ ఆమె గొల్లప్రోలు ఎంపీడీవోగా విధులు నిర్వర్తించనున్నారు. ఆమెకు అన్ని విభాగాల పని తీరు, కార్యాలయంలో అధికారులు, సిబ్బంది విధులు, ఇతర అంశాలపై ఎంపీడీవో క్రరిస్వప్న వివరించారు. 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె శిక్షణా కలెక్టర్‌గా వివిధ విభాగాల్లో శిక్షణ పొందుతున్నారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన వారు. కాగా తాటిపర్తి సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు, ఉపసర్పంచ్ దానం వెంకటేష్‌లు ట్రైనీ కలెక్టర్‌ను కలిసి అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో పంచాయతీ తీర్మానాలకు విరుద్ధంగా చేస్తున్నారని, పంచాయతీ తీర్మానం లేకుండా గోకులం లబ్ధిదారులను ఎంపిక చేశారని ఫిర్యాదు చేశారు.

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా సూరిబాబు



సూరిబాబు

పెద్దాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడుగా పట్టణానికి చెందిన నీలపాల సూరిబాబు ఎన్నికయ్యారు. పెద్దాపురంలో నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభల కార్యక్రమంలో ఆయనను ఎన్నుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి దారపు రెడ్డి క్రాంతికుమార్, సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, సత్యనారాయణ, దారపురెడ్డి కృష్ణ, గడిగట్ల సత్తిబాబు, నరసింహమూర్తి, సుబ్బ లక్ష్మీ అభినందించారు.

హక్కులను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

పెద్దాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు తమ హక్కులను కాపాడుకోవాలని ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వినియోగదారుల దినోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వినియోగదారుల రాయితీలు, ఉచిత ప్రకటనలను ఆన్‌లైన్‌లో చూసి మోసపోవద్దన్నారు. కొనుగోలు చేసిన ప్రతీ వస్తువు తయారీ, చిరునామా, గడువు తేదీ, కస్టమర్ కేర్ నంబర్‌ను చూసుకోవాలన్నారు. పలు విషయాలు వివరించారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నార్త్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కాపవరం గ్రామంలో సోమవారం సిబ్బంది నిర్వహించిన దాడుల్లో సారా విక్రయిస్తున్న నూతలపాటి వాడపల్లిని అరెస్ట్ చేసి 5 లీటర్లు స్వాధీనం చేసుకున్నట్టు ఆస్టేషన్ సీఐ కె.రామ్మోహనరావు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ కుమార్ పాల్గొన్నారు.

సోమనాధీశ్వర రథయాత్ర

గొల్లప్రోలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమనాధీశ్వర రథయాత్ర వైభవంగా జరిగింది. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన సోమ్‌నాథ్ ఆలయంలోని సోమనాధీశ్వర వజ్రలింగాన్ని ప్రజల దర్శనార్థం రథంపై ఉంచారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఈ యాత్రను నిర్వహిస్తున్నట్టు.. మంగళవారం చేబ్రోలు, దుర్గాడలో యాత్ర జరుగుతుందని బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు తెలిపారు.

చాగంటి సూరిబాబుకు మాతృ వియోగం

కరప, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు చాగంటి సూరిబాబు మాతృమూర్తి ప్రభావతి(78) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. కాకినాడలోని అన్నవరం సత్యవతి దేవి మహిళా కళాశాలలో ప్రభావతి హిందీ పండిట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందారు.

మహిళా సమాఖ్య సామాజిక కార్యక్రమాలు

కాకినాడ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆంధ్రాపాలిటెక్నిక్ కళాశాల్లో అఖిల భారత మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ ఓఎన్జీసీ ప్రోత్సాహంతో కళాశాల ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులకు ఉపయోగపడే శానిటరీ నాప్కిన్‌లను దహనం చేసే మిషన్‌ను అందజేశారు. సమాఖ్య కార్యదర్శి భానుమతి, ఉపాధ్యక్షురాలు మీనాక్షి, కోశాధికారి పద్మజావాణి, డాక్టర్ రత్నగిరి ఉష, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జనార్ధనరావు ఉన్నారు.

దాడులను నిరసిస్తూ ఆందోళన

ప్రత్తిపాడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులను నిరసిస్తూ మండలంలోని పెద్దిపాలెం, లంపకలోవ గ్రామాల్లో మహిళలు ర్యాలీలు సోమవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో పెద్దిపాలెంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న దాడులు నిరసిస్తూ లంపకలోవ హైస్కూల్ వద్ద ప్రతిజ్ఞ చేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మెడలకు ఉరి తాళ్లు బిగించుకుని నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

సమస్యలు పరిష్కరించకుంటే ఉరే గతి

38వ రోజుకు ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల దీక్షలు

రంపచోడవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా చేపట్టిన ధర్నా సోమవారం 38వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మెడలకు ఉరితాళ్లు తగిలించుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవట్లేదన్నారు. ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకుడు రామన్నదొర మాట్లాడుతూ గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. యూటీఎఫ్, సీపీఎం, సీఐటీయూ, గిరిజన సంఘాలు పూర్తి మద్దతు ప్రకటించాయి. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ రాష్ట్ర కమిటీ మెంబర్ అనంతకుమారి, ఏఐకేఎంఎస్ ఉపాధ్యక్షుడు ఐవీ రమణ, గురు కుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయ నాయకులు శామ్యూల్, తాతాజీ, సత్యనారాయణరెడ్డి, పాపాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల డిప్యుటేషన్లను తక్షణం రద్దు చేయాలని, గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, దేవీపట్నం తహసీల్దారు కరక సత్యనారాయణలకు ఆదివాసీ జేఏసీ, పారా లీగల్ వలంటీర్లు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం ఐటీడీఏ ఎదురుగా 37వ రోజు రిలే దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు, మడకం వీరవెంకట వరప్రసాద్‌దొర పాల్గొన్నారు.


దేవీపట్నం తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


తహసీల్దారు వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ సంఘ నాయకులు

'అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే రోడ్లకు విఘాతం'

వై.రామవరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలోని లోతట్టు ప్రాంతాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన రహదారుల నిర్మాణాలు ఏళ్లు గడిచిన పూర్తికాకపోవడానికి అధికారులు, రాజకీయ ప్రజాప్రతినిధుల నిర్లక్ష్య ధోరణే కారణమని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి ఆవేదన చెందారు. గుర్తేడు వరకు నిలిచిపోయిన రహదారి నిర్మాణం కోసం ఎనిమిది రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న నేపథ్యంలో సోమవారం అధిక సంఖ్యలో ఆదివాసీలు ర్యాలీగా తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి తహసీల్దారు వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఐటీడీఏ ఐటీడీఏ పీవో, అధికారులు సమస్యపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడ్ల త్రిమూర్తులు, పల్లాల లింగారెడ్డి, మడిగొంట వెంకటేశ్వర్లు, పుడిగి లక్ష్మణరావు, గుడ్ల ప్రసాద్, బత్తుల శారదాదేవి పాల్గొన్నారు.


ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

పీసా కమిటీల ఎన్నిక

మోతుగూడెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశాల మేరకు పొల్లూరు, ఫోర్‌బై గ్రామాల్లో పీసా కమిటీల ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా చింతూరు ఈవోపీఆర్డీ మోహన్ వ్యవహరించారు. పొల్లూరు పీసా కమిటీ ఉపాధ్యక్షురాలిగా కొర్ల మంగళ, కార్యదర్శిగా కిలో కమలహాసన్, ఫోర్‌బై కమిటీ ఉపాధ్యక్షుడిగా వంతల ప్రసాద్, కార్యదర్శిగా రావు కిలో శంకరరావును ఎన్నుకున్నారు.

రాజవొమ్మంగి (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో మంగళవారం పీసా దినోత్సవం నిర్వహించనున్నట్టు రాజవొమ్మంగి ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు తెలిపారు. ఇందుకుగాను ప్రతి పంచాయతీకి ప్రభుత్వం రూ.10వేలు మంజూరు చేసిందన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 47 అర్జీలు

రంపచోడవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు కల్పశ్రీ, ఏపీవో (జి) డీఎన్‌వీ రమణ ప్రజల నుంచి 47 అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో డీఈవో వై.మల్లేశ్వరరావు, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, ఏరియా ఆసుపత్రి ఆర్ఎం వెంకటఇందిర, ఈఈలు సుబ్బయ్య, ఐ.శ్రీనివాసరావు, గాబ్రియేలు, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్‌దొర, డీటీలు శ్రీధర్, స్వామి, రవీంద్రబాబు, త్రిమూర్తులు, పీఏవో ఎంఎల్ రాంబాబు, ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి, పీహెచ్‌వో కె.చిట్టిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్ కలెక్టరు కల్పశ్రీ

40 లీటర్ల నాటుసారా స్వాధీనం

దేవీపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినభీంపల్లి గ్రామంలో సోమవారం రంపచోడవరం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.నాగరాహుల్ ఆదేశాలతో ప్రొహిబిషన్-ఎక్సైజ్ సీఐ ఎస్.శ్రీధర్ తన సిబ్బందితో కలిసి సారా బట్టీలపై ఆకస్మికదాడులు నిర్వహించారు. చినభీంపల్లిలో నాటుసారా తయారీకి సిద్ధంగా వున్న 800 లీటర్ల బెల్లపుఊటను, ఎస్.రామన్నపాలెంలో వెయ్యి లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేశారు. ఎక్కడా నాటుసారా తయారు చేస్తున్నట్టు తెలిస్తే తమకు వెంటనే సమాచారం అందించాలని ఎక్సైజ్ సీఐ కోరారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

సెంట్రల్ జోన్ మెన్ ఫుట్‌బాల్ పోటీల్లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

గండేపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నర్సాపురంలోని స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఈనెల 16, 17 తేదీల్లో జరిగిన జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ మెన్ ఫుట్‌బాల్ గేమ్ పోటీల్లో సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ కేరళలో జరిగే పోటీల్లో కె.ఇమ్మానియేలు, నవాజ్‌షరీఫ్ సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. వారిని వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి అభినందిస్తూ చెరో రూ.5వేలు నగదు అందించి టోర్నమెంటులో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి విజేతలుగా నిలవాలని శుభాకాంక్షలు తెలిపారు.


ఆదిత్య విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ధనుర్మాస సేవ స్థానంలో ప్రాకారసేవ

అన్నవరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో చిరుజల్లులు పడుతున్న నేపథ్యలో సోమవారం ధనుర్మాససేవను ప్రాకారసేవగా నిర్వహించారు. ధనుర్మాససేవలోభాగంగా స్వామి, అమ్మవార్లు కొండ దిగువ ప్రధానవీధుల్లో గ్రామోత్సవం జరుపుతారు. చిరుజల్లులతో స్వామి, అమ్మవార్లను ఆలయం లోపల ప్రాకారమండపంలో ముమ్మారు ప్రదక్షిణ చేయించారు. ఈవో రామారావు టెంకాయి కొట్టి ప్రారంభించారు.

తొండంగి సర్వసభ్య సమావేశం

తొండంగి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తొండంగి మండలంలో చేపట్టిన పనుల పురోగతి, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులపై సోమవారం మండల సర్వసభ్య సమావేశంలో చర్చించారు. వైస్ ఎంపీపీ-2 యాదాల రమణ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరగ్గా ఎంపీపీ వైస్ ఎంపీపీ-1 గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా తొండంగి ఎంపీటీసీ శివకోటి ప్రకాష్ ఇటీవల జరిగిన సిమెంట్ రోడ్డు పనుల ప్రారంభంలో ప్రొటోకాల్ పాటించలేదని శిలాఫలకంపై తనపేరు లేకపోవడం సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

జగ్గంపేటలో ఉచిత అన్నాక్యాంటీన్

జగ్గంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రతి సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నిర్వహిస్తున్న ఉచిత అన్నాక్యాంటీన్‌ను సోమవారం జె.కొత్తూరుకు దివంగత గంటా అప్పారావు, మంగయమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు గంటా ఫకీర్‌రాజ్యలక్ష్మి దంపతులు, పోసిన అప్పన్న దొరకుమారి దంపతులు, గంట గంగారావు, సత్యవేణి దంపతులు, పి.బంగారయ్య బేబీ దంపతులు, సీహెచ్ సత్యనారాయణ సుశీల దంపతులు, ఎల్.రామకృష్ణ, ఇందిరాదేవి దంపతులు, ఎ.పాపారావు, సబ్బలక్ష్మి దంపతులు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన అన్నాక్యాంటీన్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు.

జనసేన ఇన్‌చార్జిని కలిసిన పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్

కిర్లంపూడి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన అడబాల భాస్కరరావు జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్‌ను సోమవారం కిర్లంపూడి మండలం రామచంద్రపురంలోని ఆయన స్వగృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రమేష్‌కు చైర్మన్ భాస్కరరావు పుష్పగుచ్ఛం ఇచ్చారు. అనంతరం పుష్కర ప్రాజెక్టు చైర్మన్ భాస్కరరావును రమేష్ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

క్రిస్మస్ వేడుకలు

తుని రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తునిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొండవారిపేట అంగన్‌వాడీ కేంద్రంలో క్రిస్మస్ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. వివిధ వేషధారణల్లో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.సరస్వతి, అంగన్‌వాడీ వర్కర్లు వై.ధనలక్ష్మి, ఎం. లలిత కుమారి, వి.సాయమ్మ, ఎం.చిట్టిపాప పాల్గొన్నారు.

జె.అన్నవరంలో..

ఏలేశ్వరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జె.అన్నవరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సీహెచ్‌వో పీఎం కుమారి నేతృత్వంలో వైద్యులు శ్రీలక్ష్మీ, పాపారావు ఆస్పత్రి సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. వైద్యఆరోగ్య సిబ్బంది దైవకృష్ణ, నానిబాబు, జగదీష్, రాజేంద్ర ప్రసాద్. పేర్రాజు, అనంతంలక్ష్మి, సత్యవేణి ఉన్నారు.

ఘనంగా కోటిదీపోత్సవ కార్యక్రమం

శంఖవరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అంధ్రా శబరిమలైగా వీరాజిల్లుతున్న సిద్ధివారిపాలెం అయ్యప్ప క్షేత్రంలో భారీగా భక్తులు హాజరై కోటిదీపోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు గురుస్వామి ఆధ్వర్యంలో సుదూరప్రాంతాలనుంచి వచ్చిన అయ్యప్ప మాలధారులు,మహిళాభక్తులు కోటి దీపాలను వెలిగించి అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. స్వామికి అత్యంత ప్రీతికరమైన దీపోత్సవం నిర్వహించడం ఆనందంగా ఉందని భక్తులు తెలిపారు. కొండలమధ్య ఉన్న అందమైన ప్రాంతం కావడంతో రాష్ట్రనలుమూలల నుంచి భారీ స్థాయిలో భక్తులు ప్రతిరోజూ స్వామివారిని దర్శించుకుంటున్నారు. కేరళ శబరిమలైలా వాతావరణం ఉండడంతో, కొండల మధ్య స్వామి కొలువై ఉండడంతో భక్తులు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపుతున్నారు. దర్శనానికి వచ్చిన భక్తులకు భోజన ఏర్పాట్లను ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు.


ఆంధ్రా శబరిమలైలో కోటి దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మహిళలకు చేయూత

ఏలేశ్వరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మూది నారాయణస్వామి అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులో సోమవారం మెప్మా మార్కెట్ ఏర్పాటు చేశారు. డ్వాక్రా సంఘాల మహిళలు తయారు చేసిన తినుబండారాలు, దుస్తులతోపాటు ఆకుకూరలు తదితర వస్తువులను మార్కెట్‌లో అమ్మకాలు చేశారు. నారాయణస్వామి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో మహిళలు ఆర్థికంగా ఎదగడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. టీఎంసీ గల్లా సాయికుమార్, కోరాడ కృష్ణమోహన్, బాబ్జి, పలివెల శ్రీనివాస్, జగదీష్ ఉన్నారు.


మార్కెట్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు నారాయణస్వామి

అక్రమంగా ఎద్దులు తరలిస్తున్న వాహనం సీజ్

కిర్లంపూడి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణవరం టోల్ ప్లాజావద్ద పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆదేశాలతో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కిర్లంపూడి ఇన్‌చార్జి ఎస్ఐ టి.రఘునాదరావు వాహనాలు తనిఖీ చేశారు. కోదాడ నుంచి విజయనగరం తీసుకువెళ్తున్న పశువుల వ్యాన్ ముందస్తు అనుమతి లేకుండా, పశువులకు గడ్డి, నీరు పెట్టకుండా తరలిస్తుడడం.. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేశారు. వాహనంలోని 11 ఎద్దులను గోశాలకు తరలించారు. పశువులను అక్రమంగా తరలిస్తున్న సీహెచ్ రామిరెడ్డిను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు.


అక్రమంగా తరలిస్తున్న ఎద్దులు

ప్రత్తిపాడు ఆసుపత్రి అభివృద్ధికి కృషి

అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని 50 పడకల ఆస్పత్రి వైద్యవిధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా తెలిపారు. సీహెచ్‌సీ ఆస్పత్రి ఆవరణలో సోమవారం ఆస్పతి అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. ఈ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే సత్యప్రభ, సభ్యులుగా వెలుగుల కొండలరావు(నాని), బొల్లు వెంకటేశ్వరరావు(చిన్న) ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ ఆస్పత్రి సిబ్బంది బాధ్యతాయుతంగా సేవా దృక్పథం అంకితభావంతో రోగులకు వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, బొల్లు కొండలరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడులో జీడిపిక్కల కార్మికులు ఆందోళన

ప్రత్తిపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో సోమవారం చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమ కార్మికులు వంటావార్పుతో ఆందోళన నిర్వహించారు. కార్మికులు 38వరోజుతహసీల్దార్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆందోళనవ్యక్తం చేశారు. అనిశెట్టి వీరబాబు, చక్రధర్, ధర్మజీ, ఆది, కాంతారావు,రామదుర్గ, జయలక్ష్మి, భాగ్యలక్ష్మి,అన్నపూర్ణ,శివాలక్ష్మి, పాపారత్నం పాల్గొన్నారు.


వద్దవంటావార్పు చేసి ఆందోళన చేస్తున్న కార్మికులు

కాంట్రాక్టు కార్మికుల బ్రాంచ్ నూతన కమిటీ

మోతుగూడెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ యూనియన్ నాయకులు చింత రాంబాబు, బీవీ రమణ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికుల సమావేశం మోతుగూడెంలో జరిగింది. సీఐటీయూ రీజియన్ యూనియన్ నాయకుడు జాజుల రత్నాకర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కావాలంటే కార్మికులంతా ఐక్యంగా ఉండాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల నూతన బ్రాంచ్ కమిటీ ఏర్పాటు చేశారు. ప్రెసిడెంట్‌గా గుబ్బల ప్రేమ్‌సన్, సెక్రటరీగా పేపకాయల శ్రీను, కోశాధికారిగా దొడ్డి మల్లేష్, వైస్ ప్రెసిడెంట్‌గా జోసఫ్, సభ్యులుగా సూరిబాబు, మహేష్, స్వామి, కార్తీక్, సీతలను ఎన్నుకున్నారు.

డీఎడ్ కళాశాల పీడీ సస్పెన్షన్

రంపచోడవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డీఎడ్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కె.పోతురాజును సస్పెండ్ చేసినట్టు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నాగ రాహుల్



చింతూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల నిర్వహణలో నిబంధ నలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నాగ రాహుల్ పేర్కొన్నారు. సోమవారం ఆయన చింతూరు సీఐ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మద్యం దుకాణాల నిర్వహణ తీరుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టను న్నామన్నారు. మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్ ఏర్పాటు చేయడంతో పాటు బెల్టు షాపులకు మద్యం సరఫరా లాంటి ఘటనలు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందిస్తే విచారణ జరిపి కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వై.రామవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం, మారేడుమిల్లి మండలాల్లో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మారేడుమిల్లి ఐసీడీఎస్ సీడీపీవో వీఎస్ ప్రసన్న తెలిపారు. మారేడుమిల్లి మండలంలో ఏడు, వై.రామవరం మండలంలో పది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎస్టీ స్త్రీ అభ్యర్థులకు 7.1.24 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉండాలని, టెన్త్ ఉత్తీర్ణత లేనిచో ఆపై ఎక్కువ తరగతి విద్యార్హత ఉండాలన్నారు. స్థానిక స్థిర నివాసురాలై ఉండి కుల ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5గంటలలోపు మారేడుమిల్లి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సీడీపీవో సూచించారు.

'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

గండేపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎంసీఏ విద్యార్థులు ఇటీవల పర్వతనేని బ్రహ్మయ్య సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెక్నో సాంస్కృతిక పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సమావేశం విభావా- 2024లో ఆదిత్య యూనివర్సిటీ ఐ మాక్ విభాగం విద్యార్థులు పి.కుమారస్వామి, షరీఫ్ ఉస్మాన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కోడింగ్ అండ్ డీకోడింగ్ విభాగంలో ప్రథమ స్థానాన్ని సాధించినట్లు విభాగాధిపతి డాక్టర్ ఎం.వంశీకృష్ణ తెలిపారు. తమ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలవడం అభినందనీయమని ప్రోఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి అభినందించారు.

పలువురి పరామర్శ

గండేపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు మేడిబోయిన గోవిందరాజులు(అబ్బులు) ఇటీవల మృతిచెందారు. దీంతో వారి కుమారులు మేడిబోయిన శ్రీను, శివరామకృష్ణ, గంగాధర్, సూర్యచంద్రను సోమవారం పలువురు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, గుల్లపూడి నాని, పెమ్మనబోయిన వరప్రసాద్, సాయిబాబా గురువర్యులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

'పెళ్లి కానుక' అందజేత

జగ్గంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంలో కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన తారు వీరలక్ష్మి పురంసెట్ దంపతులకు, గండేపల్లి మండలం గ్రామానికి మల్లేపల్లి గ్రామానికి చెందిన నట్టే నాగలక్ష్మి సీహెచ్ కిరణ్ కుమార్ దంపతులు టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతులనవీన్ జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన వధూవరులకు రూ.20వేల చొప్పున రెండు జంటలకు, రూ.40వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

జగ్గంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలోని వివిధ బ్యాంక్‌లను సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సిబ్బందితో కలిసి సోమవారం సందర్శించారు. జగ్గంపేటలోని యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ, సీబీఎస్, కెనరా బ్యాంక్, రామవరం యాక్సిస్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాగంపేట యూనియన్ బ్యాంక్ తదితర బ్రాంచ్‌ల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించి బ్యాంక్ మేనేజర్లను, సిబ్బందిని, సెక్యూరిటీ సిబ్బందితో బ్యాంక్ భద్రతా విధానాలు అడిగి తెలుసుకున్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ

కోటనందూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో కిషోరి వికాసంపై టీవోటీ శిక్షణను పంచాయతీ కార్యదర్శులు, వీఆరోవోలు, ఏఎన్ఎం తదితర అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో కె.శ్రీలత బాల్యవివాహాలు, పోక్సో వ్యక్తిగత పరిశుభ్రత, రుతుక్రమ పరిశుభ్రత, రక్తహీనత, పౌష్టికాహారంతదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ లగుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు పనిముట్లు

కిర్లంపూడి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రామచంద్రపురంలో పరిసర గ్రామ రైతులకు జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ వ్యవసాయ పనిముట్లు అందించారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లో సోమవారం దాడులు నిర్వహించారు. రాచపల్లి అడ్డురోడ్డు వద్ద 180లీటర్లసారా ఆటోతో బుంక రాజాను అరెస్ట్ చేశారు. కిర్లంపూడి మండలం సోమవరం, కృష్ణవరం గ్రామాల్లో నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించి 4వేల లీటర్లబెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

ప్రత్తిపాడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని యర్రవరం కార్యదర్శి ఎంవీ రామరాజువర్మ తల్లి వెంకట సీతారామలక్ష్మి ఇటీవల మృతితో ఆ కుటుంబాన్ని ఎంపీ పిల్లి బోస్ పరామర్శించారు. ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

డీఏవీ పాఠశాలలో గణితం, సైన్స్ డే

మోతుగూడెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలోని డీఏవీ పాఠశాలలో మ్యాథమెటిక్స్, సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన కృత్యాలను లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో ప్లాంట్ మేనేజరు భీమవరపు బాలకృష్ణ పరిశీలించారు. జెన్‌కో ఎస్ఈ చిన్న కామేశ్వరావు, డీఈటీ వరప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థుల కృత్యాలను పరిశీలిస్తున్న ఏపీ జెన్‌కో ప్లాంట్ మేనేజరు బాలకృష్ణ